



ఎయిర్‌పోర్ట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలుకుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

విశాఖ రుణం తీర్చుకుంటాం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

- కూటమిని ఆదరించిన జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం
- మధురవాడ నుంచి ఎయిర్‌పోర్టు వరకూ ఫ్లైవోవర్ల నిర్మాణంపై దృష్టిసారించాలని అధికారులకు ఆదేశాలు
- భోగాపురం ఎయిర్‌పోర్టు వరకూ బీచ్ కారిడార్ అభివృద్ధి
- మెట్రో రైలు ప్రాజెక్టును కూడా పట్టాలెక్కించాలి
- రైల్వే జోన్‌కు అవసరమైన స్థలాన్ని త్వరలోనే అప్పగిస్తాం
- నగరంలో ఇంటింటికీ కొళాయి
- గంజాయిపై ఉక్కుపాదం
- భూ కబ్జాదారులపై కఠిన చర్యలు
- మాడుగుల-చోడవరం మధ్య సెజ్ ఏర్పాటు

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల అధికారుల సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు



మెడ్ టెక్‌జోన్‌లో ప్రారంభించిన కంపెనీలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి):

విశాఖకు కూటమి ప్రభుత్వం రుణపడి ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారి జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన గురువారం రాత్రి ఎయిర్‌పోర్టులోని లాంజ్‌లో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కూటమిని ఆదరించిన విశాఖను అన్నివిధాలా అభివృద్ధి చేస్తామన్నారు. విశాఖ అంటే హుద్‌హుద్ ముందు, తరువాత అనే విధంగా మార్చామన్నారు. అప్పుడే కొత్త ఎయిర్‌పోర్టు గురించి ఆలోచన చేశామన్నారు. అందుకే ప్రత్యామ్నాయంగా భోగాపురం ఎయిర్‌పోర్టు తెచ్చామన్నారు. ఎయిర్‌పోర్టును 2026 నాటికల్లా పూర్తిచేస్తామని తెలిపారు. ఇప్పటికే గుర్తించిన భూమితోపాటు మరో 500 ఎకరాలు ఇచ్చి అభివృద్ధిచేస్తామన్నారు.

నగరంలో ఎయిర్‌పోర్టుకు అనుబంధంగా ఉండే రోడ్లు అభివృద్ధి చేయాలని, ట్రాఫిక్ జంక్షన్ల వద్ద రహదారులు విస్తరించాలని అధికారులను చంద్రబాబునాయుడు ఆదేశించారు. మధురవాడ నుంచి ఎయిర్‌పోర్టు వరకు ఫ్లైఓవర్ల నిర్మాణంపై దృష్టిసారించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అదే విధంగా విశాఖ నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకు బీచ్ కారిడార్ అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. శ్రీకాకుళం జిల్లాలో మూలపేట పోర్టు వరకు బీచ్‌రోడ్డును విస్తరించాలన్నారు. నగరంలో మెట్రో ప్రాజెక్టును

... మిగతా 6వ పేజీలో

'లులు' ప్రతినిధులతో చర్చిస్తాం

- 'వేదాంత' బిజినెస్ సెంటర్‌ను పట్టాలెక్కిస్తాం
- అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా మాస్టర్‌ప్లాన్

గతంలో తమ ప్రభుత్వ హయాంలో అనుమతులు మంజూరుచేసిన లులు మాల్‌ను ఆర్కే బీచ్‌రోడ్డులో ఏర్పాటుచేసేందుకు ప్రయత్నిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఆ సంస్థ ప్రతినిధులతో చర్చిస్తామన్నారు. అదేవిధంగా గాజువాకలో హిందుస్థాన్ జింక్ కర్మాగారం ప్రాంతంలో బిజినెస్ సెంటర్ ఏర్పాటుకు గతంలోనే వేదాంత సంస్థతో ఒప్పందం జరిగిందని, అయితే వైసీపీ ప్రభుత్వం దానిని పూర్తిగా పక్కనపెట్టేసిందన్నారు. దానిని తిరిగి పట్టాలెక్కించేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి తెలిపారు. వీఎంఆర్‌డీఏ రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌లో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారంగా మార్పులు చేశారని సీఎం అన్నారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా మాస్టర్‌ప్లాన్‌ను తయారుచేయాలని అధికారులను ఆదేశించారు.



మెడ్ టెక్ జోన్‌లో కొత్త కంపెనీలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

విశాఖ రేంజ్ డీఐజీగా గోపీనాథ్‌జెట్టి



విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి):

విశాఖ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్(డీఐజీ)గా గోపీనాథ్‌జెట్టిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం డీఐజీగా పనిచేస్తున్న విశాల్‌గున్నీకి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. 2008 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన గోపీనాథ్‌జెట్టి ప్రస్తుతం గ్రేహౌండ్స్ డీఐజీగా పనిచేస్తున్నారు.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక లోపం

ప్రత్యామ్నాయ రైలు ఏర్పాటుచేసిన అధికారులు

విశాఖపట్నం, జూలై 11: విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లాల్సిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20833)లో గురువారం ఉదయం సాంకేతిక లోపం తలెత్తడంతో స్టేషన్‌లోనే నిలిపివేశారు. ప్రయాణికులు అసహనం వ్యక్తం చేయడంతో డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్‌తోపాటు ఉన్నతాధికారులు స్టేషన్‌కు చేరుకుని ప్రత్యామ్నాయంగా ప్రత్యేక ఏసీ రైలును ఏర్పాటుచేశారు. దీంతో ఉదయం 5.45 గంటలకు బయలుదేరాల్సిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ స్థానంలో 14 థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లతో ప్రత్యేక రైలు ఏడు గంటలకు విశాఖ నుంచి బయలుదేరింది. గురువారం మధ్యాహ్నం సికింద్రాబాద్ నుంచి విశాఖ వచ్చే ప్రయాణికులు కూడా ఈ ప్రత్యామ్నాయ ప్రత్యేక రైలులోనే వచ్చారు.

బొర్రా గుహలకు ముప్పు!

- వాటిపై నుంచే రెండో ట్రాక్ నిర్మాణం
- పట్టించుకోని పర్యాటక శాఖ అధికారులు
- అలైన్‌మెంట్ మార్చాలంటున్న గిరిజనులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని డిమాండ్

-మెయిన్ 12లో

ఉక్కులో నూరుశాతం ఉత్పత్తి

- ప్రధాని ఆశీస్సులు, మద్దతులో కర్మాగారం పూర్తి సామర్థ్యానికి చేరుకుంటుంది
- ప్లాంటును మూసివేస్తారనే భయం వద్దు
- దేశాభివృద్ధికి విశాఖ ఉక్కు కర్మాగారం తోడ్పాటు
- కేంద్ర ఉక్కు శాఖా మంత్రి హెచ్.డి.కుమారస్వామి



ప్లాంట్ మోడల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డి.కుమారస్వామి

ఉక్కుటౌన్‌షిప్, జూలై 11:

ప్రధానమంత్రి ఆశీస్సులు, మద్దతుతో స్టీల్ ప్లాంటు వంద శాతం ఉత్పత్తి సామర్థ్యానికి చేరుకుంటుందని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖా మంత్రి హెచ్.డి.కుమారస్వామి అన్నారు. ఆయన గురువారం సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో కలిసి స్టీల్‌ప్లాంటును సందర్శించారు. బుధవారం నగరానికి చేరుకున్న మంత్రులు రాత్రి స్టీల్‌ప్లాంటు గెస్ట్‌హౌస్‌లో బస చేశారు. గురువారం ఉదయం ప్లాంటు ఈడి (వర్క్స్) భవనంలో మోడల్ గది, అవార్డు గ్యాలరీని సందర్శించారు. అనంతరం ప్లాంటులోని కోక్-ఓవెన్స్, బ్లాస్ట్‌ఫర్నేస్‌లు, స్టీల్ మెల్ట్ షాప్, వైర్‌రాడ్ మిల్స్ విభాగాలను పరిశీలించారు. ఆ తరువాత స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలనా భవనంలోని బోర్డు రూమ్‌లో సీఎండీ, డైరెక్టర్‌లు, సీవీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్టీల్‌ప్లాంటు పనితీరు, ప్రస్తుత పరిస్థితులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎండీ అతుల్‌భట్ వివరించారు. ఆ తరువాత కేంద్ర మంత్రులు అధికార, కార్మిక, వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్లాంటును ప్రైవేటీకరణ చేయరాదని, సెయిల్‌లో

... మిగతా 6వ పేజీలో

ఉక్కు వర్గాల్లో చిగురిస్తున్న ఆశలు

- గతంలో ఏ కేంద్ర మంత్రీ ఇంత సానుకూలంగా మాట్లాడలేదంటున్న కార్మికులు
- రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పటికీ, ఇప్పటికీ పరిస్థితులు మారాయని అంచనా
- ప్లాంటు పరిరక్షణపై కూటమి నేతలు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారని ఆశాభావం

ఉక్కుటౌన్‌షిప్, జూలై 11: విశాఖ పర్యటనలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి, సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మలు స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వకపోయినప్పటికీ వారి మాటలను బట్టి ఉక్కు వర్గాల్లో కొంత ఆశలు చిగురించాయి. స్టీల్‌ప్లాంటు సందర్శన సందర్భంగా కేంద్ర మంత్రి అధికార, కార్మిక వర్గాలు, వివిధ అసోసియేషన్‌ల ప్రతినిధులతో మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటుకు అంతా మంచే జరుగుతుందని, ఇక్కడి పరిస్థితులను ప్రధానమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ప్లాంటుకు అన్నివిధాలా సహాయం అందిస్తామని చెప్పడంతో భవిష్యత్తులో తగిన సహకారం అందుతుందని కార్మిక వర్గం భావిస్తుంది. ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరిగేందుకు సహాయం అందిస్తామని హామీ ఇవ్వడం, తాము చెప్పిన విషయాలు శ్రద్ధగా వినడం, ఆపై అండగా ఉంటామని చెప్పడాన్ని స్వాగతిస్తున్నట్టు ఉద్యోగ, కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. గతంలో కేంద్ర మంత్రి ఎవరూ ఇంత సానుకూలంగా మాట్లాడలేదని, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్లాంటుకు ఏ విధంగా సహకారం అందించలేదని ఆరోపణలు చేస్తున్నారు. గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నోసార్లు ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రిని కలిశారని, కానీ ఒక్కసారి కూడా విశాఖ స్టీల్‌ప్లాంటు అంశంపై మాట్లాడలేదని, కనీసం విశాఖ వచ్చినప్పుడు అయినా ఇక్కడకు రాలేదని గుర్తుచేస్తున్నారు. అయితే ప్రస్తుత

... మిగతా 6వ పేజీలో

ఏదీ చేయూత?

- జిల్లాలో సుమారు పది వేల మందికిపైగా లబ్ధిదారులకు ఇప్పటికీ జమ కాని సాయం
- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- మార్చి 7న బటన్ నొక్కిన అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి



విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి):

సార్వత్రిక ఎన్నికలకు ముందు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 'వైఎస్ఆర్ చేయూత' పథకంలో భాగంగా మహిళలకు అందించే సాయాన్ని విడుదల చేస్తున్నట్టు బటన్ నొక్కారు. ఈ పథకంలో భాగంగా 45-59 ఏళ్ల మధ్య వయస్కులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పున ఆర్థిక సాయం లభిస్తుంది. నిధులు విడుదల చేస్తున్నానంటూ అప్పట్లో జగన్ అనకాపల్లి జిల్లాలోనే బటన్ నొక్కారు. నాలుగు నెలలు గడిచినా, ఇప్పటికీ జిల్లాలోని వేలాది మంది లబ్ధిదారులకు ఈ సాయం అందలేదు. అప్పటి సీఎం బటన్ నొక్కినా డబ్బులు జమ కాకపోవడంతో లబ్ధిదారులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వారికి ఏం చెప్పాలో తెలియక సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. అప్పట్లో పనిచేసిన వలంటీర్లను అడిగితే తమకేమీ తెలియదని తప్పించుకుంటున్నారు.

పది వేలకుపైగా లబ్ధిదారులు..

జిల్లాలో 84,678 మంది లబ్ధిదారులకు రూ.158.77 కోట్లను జమ చేస్తున్నట్టు అప్పట్లో జగన్ ప్రకటించారు. కానీ సుమారు పది వేల మందికిపైగా లబ్ధిదారులకు ఈ ఆర్థిక సాయం జమ కాలేదని చెబుతున్నారు. బటన్ నొక్కిన తరువాత రెండు, మూడు రోజుల్లో జమవుతుందని అప్పట్లో అధికారులు, వలంటీర్లు హామీ ఇచ్చారు. రోజులు గడిచినా చాలామంది ఖాతాల్లో సొమ్ము జమ కాకపోవడంతో మళ్లీ అధికారులను ఆశ్రయించారు. ఆ తరువాత ఎన్నికల కోడ్, సాంకేతిక ఇబ్బందులను అధికారులు

... మిగతా 6వ పేజీలో

జీవీఎంసీపై ఇంటెలిజెన్స్ దృష్టి

డీమ్డ్ టు బి అప్రూవల్స్‌పై ఆరా

- టౌన్‌ప్లానింగ్ కార్యాలయం నుంచి సమాచారం సేకరణ
- బాధ్యులైన అధికారుల్లో గుబులు



విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ పరిధిలో డీమ్డ్ టు బి అప్రూవ్ పేరుతో జరిగిన అక్రమాలపై ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీసినట్టు తెలిసింది. కమిషనర్ కార్యాలయంతోపాటు టౌన్‌ప్లానింగ్ విభాగంలో కొంతమంది అధికారులు, సిబ్బంది నుంచి దీనికి సంబంధించిన సమాచారాన్ని సేకరించినట్టు సమాచారం. వైసీపీ నేతలకు సంబంధించిన కొన్ని ప్రాజెక్టుల్లో లొసుగులు ఉన్నప్పటికీ జీవీఎంసీ కమిషనర్‌గా ఉన్న సాయికాంత్‌వర్మ ఉద్దేశపూర్వకంగానే వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ప్లాన్ దరఖాస్తును రోజుల తరబడి తన లాగిన్‌లో పెండింగ్‌లో ఉంచడం ద్వారా అప్రూవ్ అయ్యేలా చేశారని జనసేనకు చెందిన 22వ వార్డు కార్పొరేటర్, టీడీపీ నేతలు ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సాయికాంత్‌వర్మ అప్రమత్తమయ్యారు. ఈ ఏడాది మార్చి 13 నుంచి తాను బదిలీ అయ్యేంత వరకూ డీమ్డ్ టు బి అప్రూవ్ అయిన వాటిలో 16 ప్రాజెక్టులకు సంబంధించిన ఫైళ్లను వెనక్కి పంపించాలంటూ అమరావతిలోని డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) కార్యాలయానికి ఆర్‌టీఎస్ పెట్టారు. ఆ ఫైళ్లు వెనక్కి వస్తే వాటిల్లో లొసుగులను గుర్తించి రిమార్కులను రాయాల్సి ఉంటుంది. రిమార్కులు రాస్తే డీమ్డ్ రూపంలో అప్రూవ్ అయిన ప్లాన్‌లు రద్దయిపోతాయి. ప్లాన్ దరఖాస్తులు తిరిగి ఎల్‌టీపీ లాగిన్‌కు వెళ్లిపోవడం వల్ల కమిషనర్ రాసిన రిమార్కులను ఫుల్‌ఫిల్ చేసి తిరిగి వార్డు సచివాలయం ప్లానింగ్ కార్యదర్శి లాగిన్‌కు పంపించాల్సి ఉంటుంది. ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, నాలా ఫీజులు కట్టలేదని, వీఎల్‌టీ ఫీజులు జీవీఎంసీకి చెల్లించలేదని తెలిసినా సరే వాటి ప్లాన్‌లను తిరస్కరించకుండా డీమ్డ్ టు బి అప్రూవ్ అయ్యేలా కమిషనర్ సహకరించారని ఇంటెలిజెన్స్ అధికారులు సైతం నిర్ధారణకు వచ్చినట్టు చెబుతున్నారు. ఈ నివేదిక ప్రభుత్వంలోని ఉన్నతాధికారులకు చేరితే తాము ఇబ్బందులు పడాల్సిందేనని జీవీఎంసీలో కొందరు అధికారులు ఆందోళన చెందుతున్నారు.

కలగా మిగిలిన రైతు బజారు ఏర్పాటు

దక్షిణ నియోజకవర్గ పరిధిలో ప్రజల ఇక్కట్లు

బహిరంగ మార్కెట్‌లో కూరగాయల కొనుగోలు


నూకాలమ్మ గుడి వద్ద రోడ్డుపైనే పండ్ల విక్రయాలు


రామకృష్ణజంక్షన్ వద్ద జీవీఎంసీ మార్కెట్

డాబాగార్డెన్స్, జూలై 11: వైజాగ్ అంటేనే...ముందుగా గుర్తొకొచ్చేది.. పాతనగరం.. ఈ ప్రాంతం క్రమేపీ నిరాదరణకు గురవుతోంది. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి దూరమవుతోంది. ఇందుకు నిదర్శనం లక్షలాది మంది నివసిస్తున్న వన్‌టౌన్‌లో ఇంతవరకు రైతుబజారు ఏర్పాటు చేయకపోవడమే. అవసరాలకు పూర్ణామార్కెట్, ఇతర మార్కెట్‌లకు వెళ్లాల్సి వస్తోంది. వ్యాపారుల దోపిడీతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు చిదిగిపోతున్నాయి. రైతుబజారు ధరలకు వ్యాపారుల వద్ద కూరగాయలకు కిలోకు రూ.20 అదనం. ఈ స్థితిలో ఇక్కడ రైతుబజారు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. ఉత్తర నియోజవర్గంలో మూడు, తూర్పులో రెండు, పశ్చిమలో రెండు రైతుబజార్లు ఉన్నాయి. దక్షిణ నియోజకవర్గంలోనే కనీసం ఒక్కటైనా లేకపోవడంపై ఈ ప్రాంతవాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పూర్ణామార్కెట్, రామకృష్ణబజార్‌లే దిక్కు.

ఏ చిన్నవస్తువునైనా పూర్ణామార్కెట్, రామకృష్ణబజార్ బజార్‌లను ఆశ్రయించాల్సి వస్తోందని, అయితే అక్కడ రైతుబజార్ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. జ్ఞానాపురంలో ఉన్న హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వ్యాపారులకు మాత్రమే ఉపయోగపడుతోంది. నగరమంతా కూరగాయలు సరఫరా చేసే నియోజకవర్గంలో రైతుబజారు లేకపోవడం దారుణమని వ్యాఖ్యానిస్తున్నారు.

మూడు లక్షల జనాభాకు పాట్లు

నియోజకవర్గంలోని 14 వార్డుల పరిధిలో సుమారు మూడు లక్షలకుపైగా జనాభా ఉంది. ఇందులో ఎక్కువగా నిరుపేద, దిగువ మధ్యతరగతి ప్రజలే. కూలిపనులు, తోపుడుబండు, ఆటోడ్రైవర్లు జీవనం సాగిస్తున్నారు. వీరంతా బహిరంగా మార్కెట్‌లో పెరుగుతున్న కూరగాయలను, టమాటాలను కొనే పరిస్థితి లేదు.

స్థలం చూపిస్తే నిర్మిస్తాం

దక్షిణ నియోజకవర్గంలో ప్రభుత్వం స్థలం అందుబాటులో లేదు. స్థలం ఉంటే రైతుబజార్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. సంబంధిత అధికారులు ఈ ప్రాతంలో స్థలం గుర్తిస్తే రైతుబజార్ నిర్మాణానికి సిద్ధంగా ఉన్నాం. **-యాసిన్, మార్కెటింగ్ శాఖ అధికారి**

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకం


అమ్మవారికి అభిషేకాలు నిర్వహించిన దృశ్యం

జగదాంబ కూడలి, జూలై 11: వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం త్రికాల పంచామృతాభిషేకం నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన కార్యక్రమంలో 12 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. అర్చకులు వారితో పూజలు జరిపించి, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం అమ్మవారికి జలాభిషేకం చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, జూలై 11: ఆశీలమెట్ట సెక్షన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫా ఉండదని ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. గురుద్వారా, రమ ఆస్పత్రి, సీతంపేట, విజయ మెడికల్, సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్, ఏపీఎస్ఈబీ కాలనీ, పరిసర ప్రాంతాల్లో సరఫరాను నిలిపివేస్తామన్నారు.

అక్కయ్యపాలెం పరిధిలో...

అక్కయ్యపాలెం: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. నరసింహనగర్, రైతుబజారు, గణేష్‌నగర్, గణేష్ సేవా సంఘం, వరహగిరి కాలనీ, దాలిరాజు సూపర్ మార్కెట్, జగ్గారావు బ్రిడ్జి, యలమంచిలి వారి వీధి, శివరామరెడ్డి స్వీట్స్ షాప్, అబిద్‌నగర్, అక్కయ్యపాలెం ప్రధాన రహదారి ప్రాంతాల్లో ప్రాంతాల్లో ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండన్నారు.

జగదాంబ పరిధిలో...

జగదాంబ కూడలి: నిర్వహణ పనుల నేపథ్యంలో జోన్ 1 డివిజన్ పరిధి ఆఫీషియల్ కాలనీ, కలెక్టర్ ఆఫీసు డౌన్ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని జోన్ 1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

యోగాతో అనారోగ్య సమస్యలు దూరం


శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న స్వామి రితేదేవ్

కంచరపాలెం, జూలై 11: అన్ని అనారోగ్య సమస్యలకు యోగాతో చెక్ పెట్టవచ్చునని పతంజలి యోగా సమితి ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీఎస్‌వి.ప్రసాద్ పేర్కొన్నారు. సమితి హరిద్వార్ పర్యవేక్షణలో బాపూజీనగర్, ఎఫ్‌సీఐ గోడౌన్స్ రామకృష్ణ ధ్యాన కేంద్రంలో గురువారం శిక్షణ తరగతులను ప్రారంభించారు. యోగా సాధనతో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 15లోగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎస్.నాగేశ్వరరావు, వైకే.ప్రభాకర్, బి.ప్రభాకర్, మూర్తి, గణపతిరావు, యువభారత్ రెడ్డి, శైలజ, రాంబాబు పాల్గొన్నారు.

ఆత్మరక్షణతో పాటు ఇతరులను కాపాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న మేడపాటి రవీంద్ర

సీతమ్మధార, జూలై 11: పాఠశాలల్లో ప్రమాదాలు జరిగితే ప్రతి విద్యార్థీ ఆత్మరక్షణతో పాటు ఇతర విద్యార్థులను కాపాడాలని బీజేపీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పేర్కొన్నారు. సీతమ్మధార శారద విద్యానిలయంలో రోటరీ ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో గురువారం విద్యారులకు ఫైర్ సేఫ్టీ మాక్ డ్రిల్, అత్యవసర పరిస్థితుల్లో ఆత్మరక్షణ, పర్యావరణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేసీఐ విశాఖ మెట్రో జోన్ ప్రెసిడెంట్ జేడీపీ సురేష్ గొంప, మేడపాటి రవీంద్ర విద్యార్థులతో మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ఆఫ్ విశాఖపట్నం అధ్యక్షుడు బి.వినయ్ గాంధీ, చంద్రశేఖర్, ప్రవీణ, శ్రీనివాసరావు, రంగచార్యులు, ఫైర్ అండ్ సెఫ్టీ మాక్ డ్రిల్, స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ జోనల్ టీటీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక


విజేతలతో ఎల్ఐసీ డీఎం రామారావు, తదితరులు

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 11: లైఫ్ ఇండియా కార్పొరేషన్ (ఎల్ఐసీ) ఇంటర్ జోనల్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే డివిజనల్ జట్టు ఎంపిక పోటీలు గురువారం ముగిశాయి. విశాఖ రీజనల్ పరిధిలోని విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం బ్రాంచిల క్రీడాకారులు పాల్గొన్నారు. పురుషుల విభాగంలో కె.కార్తీక్, కె.గురుమహేష్, ఎస్ఎస్.గణేష్, మహిళల విభాగంలో వి.జ్యోత్స్న, బి.భవానీ దేవి విజేతలుగా నిలిచారు. ముగింపు కార్యక్రమానికి ఎల్ఐసీ డివిజనల్ మేనేజర్ (పర్సనల్) రామారావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు సభ్యుడు డాక్టర్ డీవీఎస్‌వై.శర్మ మాట్లాడుతూ విజేతలు వచ్చే నెల 7,8వ తేదీల్లో కర్నాటకలో జరిగే జోనల్ ఎంపికల్లో పాల్గొంటారన్నారు.కార్యక్రమంలో ఎల్ఐసీ క్లబ్ కార్యదర్శి బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరులో ఏఐటీయూసీ జాతీయ సమావేశాలు

జ్ఞానాపురం, జూలై 11: ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు సెప్టెంబరులో మూడు రోజుల పాటు జరుగుతాయని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌కే అచ్యుతరావు తెలిపారు. నగరంలో జరిగే సమావేశాల మొదటి రోజు వేలాది మందితో కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ ఉంటాయన్నారు. ఈ సమావేశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరణ చేయాలన్న నిర్ణయాలు, అసంఘటిత కార్మికుల సమస్యలపై భవిష్యత్తు కార్యచరణను రూపొందిస్తారన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మధరావు, నాయకులు బి.వెంకటరావు, ఎస్‌కే రెహమాన్, కె.సత్యాంజనేయ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

జ్ఞానాపురం, జూలై 11: ప్రపంచ జనాభా నిరతరం పెరుగుతూనే ఉందని, ఇది అనేక సమస్యలకు దారి తీస్తోందని డాక్టర్ మాణిక్య కుమారి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం జ్ఞానాపురంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రపంచం, ప్రకృతిపై జనాభా ప్రభావంపై అవగాహన కల్పించారు. భవిష్యత్తు కోసం మానవ వనరులను కాపాడుకునేందుకు ముందుకు రావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ షైజీ, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్‌బాబు, బి.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

అతిసార నుంచి పిల్లలను రక్షించుకోవాలి

సీతంపేట, జూలై 11: రాబోయే వర్షకాలంలో అతిసార ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాని కూటమి నాయకులు, జీవీఎంసీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సురక్షితమైన నీటిని తాగాలని, ట్యాంకులో, కుండీలో ఎక్కువ రోజులు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 25వ వార్డు టీడీపీ అధ్యక్షులు నమ్మి రవికుమార్, బిజెపి అధ్యక్షులు నరాల బాలకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యా ప్రవేశం'పై అవగాహన ర్యాలీ



ర్యాలీలో ఎంఈవో దివాకర్, ఉపాధ్యాయులు

కంచరపాలెం, జూలై 11: విద్యకు ప్రభుత్వం పెద్ద పీట వేసి పేద విద్యార్థులకు వసతులను కల్పిస్తోందని ఎంఈవో డి.దివాకర్ పేర్కొన్నారు.ఎన్‌రోల్‌మెంట్ పెంపు ధ్యేయంగా ప్రభుత్వం అమలుచేస్తున్న విద్యా ప్రవేశం కార్యక్రమాన్ని గురువారం జీవీఎంసీ 48వార్డు రాంజీఎస్టేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీని ఎంఈవో ప్రారంభించి, మాట్లాడారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని కోరారు. అనంతరం రాంజీ ఎస్టేట్, బాపూజీ నగర్, కప్పరాడ తదితర గ్రామాల్లో ప్లకార్డులుతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో రాంజీ ఎస్టేట్ పాఠశాల హెచ్ఎం ఎస్.దొరబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్నాథుడికి పల్లకి సేవ


పల్లకి సేవలో ఈవో రాజగోపాలరెడ్డి, తదితరులు

జగదాంబ కూడలి, జూలై 11: జగన్నాథ రథోత్సవంలో భాగంగా నృసింహావతారంలో ఉన్న స్వామికి గురువారం సాయంత్రం పల్లకి సేవ నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా లక్ష్మీదేవి శీలవిరుపు మహోత్సవం భక్తులను ఆకట్టుకుంది. పండితులు జగన్నాథాచార్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. కాగా శుక్రవారం స్వామికి సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలను సమర్పిస్తారని ఈవో టి.రాజగోపాలరెడ్డి తెలిపారు.

ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు సర్టిఫికెట్లు పంపిణీ


సర్టిఫికెట్లు అందుకున్న వారితో ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు

డాబాగార్డెన్స్, జూలై 11: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బి సర్టిఫికెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్స్‌ను ప్రిన్సిపాల్ ఆర్.మంజుల అభినందించారు. ఈ మేరకు గురువారం విజేతలకు ధ్రువపత్రాలు అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ కె.గీతాంజలి, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ రుణం తీర్చుకుంటాం

... 5వ పేజీ తరువాయి

కూడా పట్టాలెక్కించాలన్నారు. హైవేపై ఫ్లైవోవర్లు, మెట్రో ఒకదానిపై మరొకటి నిర్మించేలా ప్రణాళికలు రూపొందిస్తే భూసేకరణ భారం తగ్గుతుందన్నారు. లాభం కంటే ప్రజలకు రవాణా సౌకర్యాలు పెంచడమే మెట్రో ప్రాజెక్టు ప్రధాన ధ్యేయమన్నారు. సబ్బవరం నుంచి షీలానగర్, అక్కడ నుంచి పోర్టు వరకు జాతీయ రహదారుల విస్తరణను వేగవంతం చేయాలన్నారు. రైల్వే జోన్‌కు అవసరమైన భూమి విషయంలో వివాదం ఉందని, వారికి ఆమోదయోగ్యమైన స్థలం ఇచ్చి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మెడ్‌టెక్ జోన్‌ను మరింత అభివృద్ధి చేయాలని పేర్కొంటూ ప్రస్తుతం పది వేల కోట్ల వ్యాపారంతో నడుస్తున్న దీనిని రూ.30 వేల కోట్లకు పెంచితే ఎక్కువ మందికి ఉపాధి లభిస్తోందన్నారు. పంచగ్రామాల సమస్యపై దృష్టి పెడతామని, అక్కడ ఇళ్ల మరమ్మతులకు అనుమతి ఇస్తామన్నారు. దేవస్థానం స్థలంలో చాలామంది ఇళ్లు నిర్మించుకున్నారని, వాటిని పరిశీలించి అనుమతులు ఇవ్వాలని, ఇటువంటి చోట్ల మానవీయ కోణంలో ఆలోచన చేయాలని అధికారులకు ఆదేశించారు.

గంజాయిని పూర్తిగా గంజాయి నిర్మూలిస్తామన్నారు. ఈ విషయంలో పోలీసులు ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. విశాఖ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని గతంలో దేశంలో ప్రథమ స్థానంలో ఉన్న నగరం ఇప్పుడు నాలుగైదు స్థానాల్లోకి వెళ్లిందన్నారు. పోర్టు కాలుష్యం, నగరంలో వ్యర్థాల కాలుష్యం పూర్తిగా తగ్గించేలా ప్రణాళికలు అమలు చేయాలన్నారు. ఎన్టీపీసీ ప్లాంట్‌ను గ్రీన్ పవర్ స్టేషన్‌గా మార్చేందుకు యాజమాన్యం ముందుకు వచ్చిందన్నారు. నగరంలో అందరికీ తాగునీరు అందించాలని, ప్రతి ఒక్కరికీ కొళాయి నీటిని అందించాలన్నారు. పోలవరం కాలువ ద్వారా గోదావరి నీరు వస్తే నగరానికి నీటి సమస్య పరిష్కారం అవుతుందని చంద్రబాబు తెలిపారు.

విశాఖలో గత ఐదేళ్లలో పెద్దఎత్తున భూ ఆక్రమణలు జరిగాయని, ప్రైవేటు వ్యక్తుల వద్ద కూడా బలవంతంగా తీసుకున్నారన్నారు. అటువంటి భూములను తిరిగి సొంతదారులకు ఇప్పించాలన్నారు. భూకబ్జాలు చేసిన వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశించారు. అన్యాయానికి గురైన వ్యక్తులకు ఆస్తులు అప్పగింత, కబ్జాదారులు...ఒక్కొక్కటిగా జరగాలన్నారు. ఈ విషయంలో ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలని, జవాబుదారీగా ఉండాలన్నారు. వలంటీర్లు లేకపోతే ఇంటింటికీ పింఛన్లు ఇవ్వలేమన్నారని, కానీ సచివాలయ ఉద్యోగులతో పంపిణీ చేశామన్నారు.

మాడుగుల, చోడవరం మధ్యన సెజ్ ఒకటి తీసుకువస్తామని, అందుకు అవసరమైన భూములు పరిశీలించాలని అనకాపల్లి జిల్లా అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. అభివృద్ధి చేస్తే సంపద పెరుగుతుందని, ఆ సంపదతో సంక్షేమం అందించేలా పాలన ఉండాలని అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత ప్రజల్లో పెద్ద రిలీఫ్ కనిపిస్తోందన్నారు. రైట్‌మెన్‌ను రైట్ ప్లేస్‌లో పెట్టడం దృష్టిసారించామని పేర్కొన్నారు.

గత ఐదేళ్లలో వైసీపీ పాలకులు అనేక విధాలుగా ప్రజలను, అప్పటి విపక్షాలను వేధించారన్నారు. అధికారంలోకి వచ్చిన తాము ప్రతీకారం తీర్చుకోబోమని, తమ దృష్టి అభివృద్ధిపై ఉందని అధికారులు, ప్రజాప్రతినిధులకు సంకేతాలిచ్చారు. అదే సమయంలో తమది బ్యూరోక్రసీ గవర్నెన్స్ కాకుండా పొలిటికల్ గవర్నెన్స్ అని స్పష్టంచేశారు. సమీక్షలో కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, టీజీ భరత్, గుమ్మడి సంధ్యారాణి, ఎంపీలు ఎం.శ్రీభరత్, సీఎం రమేష్, గాజువాక, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పి.గణబాబు, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్, హరేంధిర్ ప్రసాద్ వేదికపై ఉన్నారు. ఇంకా ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేష్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, కేఎస్ఎన్ఎస్ రాజు, సీపీ శంఖబ్రత బాగ్చి, ప్రభుత్వ కార్యదర్శులు సునీత, అహ్మద్‌బాబు, అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్, టీడీపీ నేతలు గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్, పీలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కులో నూరుశాతం ఉత్పత్తి

... 5వ పేజీ తరువాయి

విలీనం చేయాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలని, ఆర్థికంగా సహకారం అందించాలని మంత్రులను సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా కేంద్ర ఉక్కు మంత్రి హెచ్.డి.కుమారస్వామి మాట్లాడుతూ ప్లాంటు మూసివేతపై భయపడవద్దన్నారు. భారతదేశ జీడీపీని మెరుగుపరచడంలో స్టీల్‌ప్లాంటు ఇతోధికంగా సహాయపడుతుందన్నారు. సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ కేంద్ర మంత్రి కుమారస్వామి విశాఖ స్టీల్‌ప్లాంటుపై ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో ఉక్కు మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్‌రాయ్, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, సెయిల్ స్వతంత్ర డైరెక్టర్ సాగి కాశీవిశ్వనాథరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు ఎకె.బాగ్చి, ఎస్ఆర్‌వీజీకె.గణేష్, జీవీఎన్ ప్రసాద్, సీవీవో ఎస్.కరుణరాజు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉక్కు వర్గాల్లో చిగురిస్తున్న ఆశలు

... 5వ పేజీ తరువాయి

పరిస్థితులు ప్లాంటుకు అనుకూలంగా ఉన్నాయని ఉక్కు వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. బుధవారం స్టీల్‌ప్లాంటులో జరిగిన సమీక్షా సమావేశంలో కూడా ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావులు ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ కానివ్వబోమని అన్నివిధాలా సహకారం అందిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్లాంటుకు త్వరలో మంచిరోజులు వస్తాయని కార్మికులు, ఉద్యోగులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పటికీ, ఇప్పటికీ పరిస్థితులు వేర్వేరుగా ఉన్నాయంటున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ప్లాంటును కూటమి నేతలు నిలబెట్టుకుంటారని ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఏదీ చేయూత?

... 5వ పేజీ తరువాయి

సాకుగా చూపించారు. ఎన్నికల తరువాత బ్యాంకు ఖాతాల్లో జమవుతాయని చెబుతూ వచ్చారు.

ఇప్పుడు రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటైంది. కానీ, లబ్ధిదారులకు సాయం అందలేదు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామంటూ గొప్పలు చెప్పిన జగన్మోహన్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు విడుదల చేసిన సొమ్ము కూడా లబ్ధిదారులకు అందకుండా చేశారంటూ పలువురు వాపోతున్నారు. గొప్పలకు బటన్ నొక్కడమే తప్పితే లబ్ధిదారులకు చేరేలా నిధులను సమీకరించి విడుదల చేయలేదని పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై సచివాలయ సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. ఆ సైట్ ప్రస్తుతం ఓపెన్ కావడం లేదని, తామేమీ చేయలేమని చెబుతున్నారు. ఈ పథకంతోపాటు విద్యాదీవెన పరిస్థితి అలానే ఉంది. ఇప్పటికీ వందలాది మంది విద్యార్థులకు సొమ్ము జమ కాలేదు. జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కడానికి చూపించిన శ్రద్ధ..నిధులు సమకూర్చడంపై పెట్టి ఉంటే లబ్ధిదారులకు ఈ ఇబ్బందులు ఉండేవి కావని పలువురు పేర్కొంటున్నారు.

ఉద్దేశ పూర్వకంగా డీమ్డ్ అప్రూవల్ చేయలేదు

» జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సురేష్‌కుమార్

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో బిజీగా ఉండడం వల్ల కొన్ని ప్లాన్ దరఖాస్తులను పరిశీలించపోవడంతో డీమ్డ్అప్రూవ్ అయ్యాయని చీఫ్ సిటీ ప్లానర్ బి.సురేష్‌కుమార్ పేర్కొన్నారు. 'ఆ 16 ఫైళ్లను వెనక్కిపంపించండి' అంటూ ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందిస్తూ ప్రెస్‌నోట్ విడుదల చేశారు. కమిషన్ లాగిన్‌కు చేరిన కొన్ని ఫైళ్లకు సంబంధించి లోసుగులున్నప్పటికీ వాటిని వెనక్కి పంపించకుండా వదిలేయడంతోనే డీమ్డ్ అప్రూవ్ అయిపోయాయని కార్పొరేటర్ పీతలమూర్తియాదవ్ ఆరోపించిన విషయం తెలిసిందే. దీంతో అప్రమత్తమైన కమిషనర్ సాయికాంత్‌వర్మ 16 ఫైళ్లను పరిశీలించాల్సి ఉన్నందున వెనక్కి పంపించాలంటూ డీటీసీపీకి లేఖ రాశారు. అయితే వాటిని కమిషర్ స్థాయిలోనే పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నందునే వాటిని ఆయనకు పంపించామని సీసీపీ పేర్కొన్నారు ఎన్నికల సమయం కావడంతో కమిషనర్ వాటిని పరిశీలించలేకపోయారని, అందుకే డీమ్డ్ అప్రూవ్ అయిపోయాయని, ఉద్దేశ పూర్వకంగా చేయలేదని విడుదల చేసిన ప్రకటనలో వివరించారు.

ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి

సీతమ్మధార, జూలై 11: ద్విచక్ర వాహనాలు నడిపే వారు ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ ధరించాలని, తమకు తాము సేఫ్టీగా ప్రయాణం సాగించడమే కాకుండా ఎదుటివారికి కూడా ప్రమాదం జరగకుండా నిబంధనలు పాటించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.వెంకటశేషమ్మ పేర్కొన్నారు. సీతమ్మధార రైతు బజార్‌లో రైతులకు, కొనుగోలుదారులకు వాహనదారులు పాటించాల్సిన విధులు, హెల్మెట్ ధరించడం పై గురువారం అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించక పోతే ప్రభుత్వం వారి జరిమానా విధిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎల్ఎపియుఎస్ ఛైర్మన్ జి.వల్లభనాయుడు, ఎస్టేట్ అధికారి కొండబాబు, సతీష్, రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉద్యానవన అధికారి సోనీ

ఉద్యానవన పంటలపై అవగాహన

పెందుర్తి, జూలై 11: పెందుర్తి రైతు బజారులో ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎస్టేట్ అధికారి వీఎస్‌ఎస్‌ఎపీ షర్మిల గురువారం కూరగాయల విక్రయ రైతులకు ఉద్యానవన పంటల వృద్ధి, కూరగాయల పెంపకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రిప్ ఇరిగేషన్ పద్ధతి ద్వారా ఆధునిక పద్ధతిలో కూరగాయల సేద్యం, ఆరుతడి పంటల వృద్ధి గురించి వివరించారు. పందిరి కూరగాయల సాగు, మల్చింగ్ విధానంలో తక్కువ ఖర్చుతో కూరగాయలు సాగు పద్ధతిపై అవగాహన కల్పించారు. ఉద్యానవనశాఖ అధికారి జి.సోనీ మాట్లాడుతూ కూరగాయాల సాగుతో అధిక లాభార్జన పొందవచ్చన్నారు. ఆధునిక పద్ధతుల్లో కూరగాయల పంటల పెంపకంపై సలహాలు, సూచనలకు ఉద్యానవన శాఖను రైతులు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రైతు బజారు సహాయకులు చిన్నబ్బాయ్, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

రేషన్ డిపోల్లో విజిలెన్స్ తనిఖీలు

వేపగుంట, జూలై 11: జీవీఎంసీ 94వ వార్డు పరిధిలోని పలు రేషన్ డిపోల్లో గురువారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అప్పల నరసింహనగర్ రేషన్ డిపోలో ఉన్న సరకు నిల్వల స్టాక్, బిల్లులను పరిశీలించారు. సింహాద్రిగర్ బంటాకాలనీలో ఎండయూ వాహనం వద్ద బియ్యం 200 కిలోలు అధికంగా ఉండడంతో 6ఏ కింద కేసు నమోదు చేశారు. ఎక్కువ ఉన్న స్టాక్‌ను రేషన్ డిపోకు తరలించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ లక్ష్మి, సర్కిల్-1 ఇన్‌చార్జి ఆర్.ఐ. చైతన్య, చెకింగ్ ఇన్‌స్పెక్టర్ నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీసీ బ్రిడ్జి మీదుగా రాకపోకలకు అనుమతివ్వాలంటూ సీపీఎం ధర్నా

మల్కాపురం, జూలై 11: డాక్‌యార్డు వంతెనను త్వరలో మూసివేస్తున్న నేపథ్యంలో ఎస్‌బీసీ బ్రిడ్జి మీదగా ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ గురువారం మల్కాపురం మెయిన్ రోడ్డులో సీపీఎం జోన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారుజ.ఈ సందర్భంగా సీపీఎం నగర ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతం నుంచి రోజూ అనేక మంది రాకపోకలు సాగిస్తుంటారని, వారంతా పోర్టు అధికారులు సూచించిన మార్గం గుండా వెళ్లి వస్తే అధిక సమయం అవుతుందని, రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్నారు.

ఎస్‌బీసీ వంతెన మీదగా రాకపోకలు సాగించేందుకు నేవీ అధికారులు అనుమతించకపోతే ప్రజలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం మల్కాపురం జోన్ అధ్యక్షుడు కె.పెంటారావు, నాయకులు లక్ష్మణమూర్తి, ఎల్.కృష్ణ, పి.రామారావు, కె.నూకరాజు, ఆర్.దేవరాజు,అర్జునరావు, అచ్యుతరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమాంబ పండగ



పూజలందుకున్న దుర్గమాంబ

పెందుర్తి, జూలై 11: మండలంలోని సరిపల్లి ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను సంప్రదాయబద్ధంగా పురవీధుల్లో ఊరేగించారు. సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అమితంగా ఆకట్టుకున్నాయి.

సినిమా గైడ్

● **భారతీయుడు-2:** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలిస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి),

● **కల్కి:** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **సారంగదరియా:** శ్రీవెంకటేశ్వర, శ్రీ నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 37, టమాటా 45,వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 30, పచ్చిమిర్చి 76, కాకరకాయలు 48, బీరకాయలు 34, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 32, క్యారెట్ 28, దొండకాయలు 34, బంగాళదుంపలు 31, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 140, మునక్కాడలు (కిలో) 115, బరబాటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 52, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 114, పొటల్స్ 36, కీరదోస 32, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 36, చిలగడదుంపలు 36, కంద 56, దేముడుచిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	97
ఫారం ధర	--	117
విత్ స్కిన్	--	204
స్కిన్‌లెస్	--	214

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I, IIలో..



65వ వార్డులోని ప్రభుత్వ ఐటీఐ ప్రహరీ పక్కన పేరుకుపోయిన చెత్తకుప్ప



రోజుల తరబడి తిష్ట వేసిన చెత్తాచెదారం

అధ్వానం.. ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణం

పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రహరీ పైనుంచి ఇష్టానుసారంగా వ్యర్థాలను పడేస్తున్న పరిసర ప్రాంతాల ప్రజలు

కుప్పలుగా పేరుకుపోయిన చెత్తాచెదారం

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విద్యార్థులు, వాకర్లు

పెదగంట్యాడ, జూలై 11: జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో చెత్తాచెదారం, డెబ్రిస్ కుప్పలు కుప్పలుగా పేరుకుపోయాయి. రోజుల తరబడి చెత్తాచెదారం ఇక్కడ ఉన్నా తొలగించే నాథులే కరువయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఐటీఐకు రెండు వైపులా ప్రహరీని ఆనుకుని నివాసాలు ఉన్నాయి. ఆయా నివాసాలకు సంబంధించిన వారు తమ ఇళ్లల్లోని వ్యర్థాలు, చెత్తాచెదారం, డెబ్రిస్ వంటి వాటిని ప్రహరీ మీదగా ఐటీఐ స్థలంలో పడేస్తున్నారు. ఎంతో కాలంగా ఇదే పరిస్థితి కొనసాగుతుండడంతో ఐటీఐ ప్రాంగణం అధ్వానంగా మారింది. వీటిని తొలగించేందుకు ఐటీఐ నిర్వాహకులు కూడా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

ఐటీఐ లోపల చెత్తాచెదారం వేస్తున్న వారికి వారికి ఎలాంటి హెచ్చరికలు చేయకపోవడంతో పాటు చర్యలు తీసుకోవడం లేదు.

కాగా విశాలమైన ఐటీఐ ప్రాంగణం నిండా పెద్ద పెద్ద చెట్లతో చాలా అందంగా ఉంటుంది. ఐటీఐ లోపల ఒక పక్కన వాకింగ్ ట్రాక్‌ను కూడా ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన అనేకమంది మహిళలు, వృద్ధులు రోజూ ఉదయం పూట ఇక్కడ వాకింగ్ చేస్తుంటారు. అయితే ఈ వాకింగ్ ట్రాక్ ప్రహరీ పక్కనే ఉండడం.. అక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారం నుంచి వెలువడే దుర్వాసనతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్కడి చెత్తకుప్పల్లోని వ్యర్థాల కోసం కుక్కలు గుంపులుగా చేరి వాటిని చెల్లాచెదురు చేస్తున్నాయి. దీంతో వాకింగ్ చేయడం ఇబ్బందికరంగా ఉంటుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఐటీఐ విద్యార్థులు కూడా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అందువల్ల ఐటీఐ యాజమాన్యం, జీవీఎంసీ అధికారులు స్పందించి ఇక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు ఎవరూ వ్యర్థాలు వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థులతో పాటు వాకర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.



గోపాలపట్నం రైతు బజారులో కందిపప్పు విక్రయాలను ప్రారంభిస్తున్న గణబాబు



66వ వార్డు మహిళా రైతు బజారులో అమ్మకాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్లు

రైతు బజార్లలో బియ్యం, కందిపప్పు విక్రయాలు ప్రారంభం

ఎన్.ఎ.డి.జంక్షన్, జూలై 11: నగరంలోని పలు రైతు బజార్లలో గురువారం నుంచి తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు విక్రయించే కౌంటర్లను ప్రారంభించారు. ఇందులో భాగంగా గ్రేటర్ 52వ వార్డు పరిధి మర్రిపాలెం రైతు బజారులో బియ్యం, కందిపప్పు విక్రయాల కౌంటరును పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో ఉన్న అధిక ధరలను నియంత్రించేందుకు తక్కువ ధరకే రైతు బజార్లలో బియ్యం, కందిపప్పు విక్రయాలను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిత్యావసర సరకుల ధరలు దారుణంగా పెరిగిపోయినా పట్టించుకున్న దాఖలాలే లేవని విమర్శించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల అధికా రులు మురళీనాథ్, కోమలి, ఎస్టేట్ అధికారి కె.వరహాలు, ప్రతాప్, టీడీపీ నాయకులు ఎం.వాసుదేవరావు, వైటీఆర్ కేబుల్ నాయుడు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే పి.గణబాబు

గోపాలపట్నం: ఇక్కడి రైతుబజారులో సబ్సిడీపై బియ్యం, కందిపప్పు విక్రయాలను ఎమ్మెల్యే పి.గణబాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుబజారు ద్వారా వినియోగదారులకు తక్కువ ధరలకే సరకులు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జేడీ సుధాకర్, రైతు బజారు ఈవో నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: జీవీఎంసీ 66వ వార్డులోని మహిళా రైతు బజారులో కందిపప్పు, బియ్యం అమ్మకాలను కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహిరంగ మార్కెట్ కన్నా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం,కందిపప్పు విక్రయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, మహ్మద్ రఫీ,గోమాడ వాసు, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: పెదగంట్యాడ రైతు బజారులో చౌక ధరకు బియ్యం, కందిపప్పు విక్రయించే కౌంటరును గురువారం 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి ప్రారంభించారు. బహిరంగ మార్కెట్లో నాణ్యమైన కిలో కందిపప్పు రూ.181 ఉండగా, ఇక్కడి రైతు బజారులో రూ.160కే విక్రయిస్తున్నట్టు జిల్లా పౌర సరఫరాల విభాగం అధికారి సూర్యప్రకాశ్ పేర్కొన్నారు. ఒక రేషన్ కార్డుకు కిలో కందిపప్పు మాత్రమే ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏఎస్‌వో కృష్ణ మాట్లాడుతూ చౌక ధరకు నాణ్యమైన బియ్యం కూడా విక్రయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, నాయకులు నమ్మి అప్పారావు, ఎం.పెంటయ్య, జి.జ్యోతిరెడ్డి, బీజేపీ నాయకుడు ఎం.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



పి.అంజలి | ఎం.తేజశ్రీ | బాల పరిమళ | మహాలక్ష్మి | దాసరి ధరణి | నందగణేశ్ | గౌతమ్ | నూకల వివేక్ | ఎల్.ప్రసన్న | బి.భవ్యశ్రీ | కె.గీత

త్రిపుల్ ఐటీలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు

గాజువాక/కూర్మన్నపాలెం/గోపాలపట్నం/ జూలై 11: రాష్ట్రంలో గురువారం సాయంత్రం వెలువడిన ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో విశాఖకు చెందిన పలువురు విద్యార్థులు మంచి ప్రతిభ కనబరచడంతో ఎంపికయ్యారు. ఈ క్రమంలో గాజువాక ఉన్నత పాఠశాలలో టెన్త్ చదివిన పట్నాన అంజలి శ్రీకాకుళం త్రిపుల్ ఐటీకి, మడక తేజశ్రీ, పి.బాలపరిమిళ ఒంగోలు త్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు అభినందించారు. అలాగే 87వ వార్డు కణితి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కేఎస్‌కే మహాలక్ష్మి, దాసరి ధరణి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం సూర్యప్రకాశ్ తెలిపారు. ఈ సందర్భంగా వారికి హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో విజయభేరి మోగించిన గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు ఎంపికై అందరి మన్ననలు పొందారు. ఈ పాఠశాలలో టెన్త్ చదివిన ఎల్.ప్రసన్న, బి.భవ్యశ్రీలు ట్రిపుల్ ఐటీ ఒంగోలుకు, కె.గీత, అక్కురెడ్డి నందగణేశ్, గౌతమ్, ఎన్.వివేక్‌లు నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలు సాధించారు.



కేన్సర్ బాధితురాలికి నగదు అందజేస్తున్న నల్లూరు సూర్యనారాయణ

పేదల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయం

86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, జూలై 11: పేదలకు సేవలు అందించడంలో, సమాజ సేవలో తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు ఎప్పుడూ ముందంజలో ఉంటారని టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. 86వ వార్డు పరిధి చినయాతపాలెంలో కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న సుంకురు నాగేశ్వరరావు, రమణమ్మ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్టు తెలుసుకున్న ఆయన గురువారం పలువురు టీడీపీ నాయకులతో వారింటికి వెళ్లి మందుల ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, సుబ్బయ్య, ఎస్.అప్పారావు, భద్ర, నాగార్జున, వెంకటేష్, తదితరులు ఉన్నారు.

'స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలి'

కూర్మన్నపాలెం, జూలై 11: స్టీల్‌ప్లాంట్ సమస్యల పరిష్కారానికి సెయిల్ విలీనం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, యు.రామస్వామి కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1246వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామితో సమావేశమై తాము కార్మికుల సమస్యలను వివరించామన్నారు. కర్మాగార సమస్యలపై మంచి ప్రణాళిక రూపొందించేందుకు, పరిస్థితిని చక్కదిద్దేందుకు 45 రోజుల సమయం కావాలని కేంద్ర మంత్రి పేర్కొన్నారన్నారు. రెండేళ్లపాటు ఎన్ఎండీసీ నుంచి ఐరన్ ఓర్‌ను అప్పుగా ఇప్పించాలని, రెండేళ్ల తర్వాత ఆ అప్పును తీర్చివేస్తామని చెప్పామన్నారు. నూతన వేతనాలు అమలు చేయకపోగా, ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్న ఉక్కు సీఎండీపై కమిటీ వేసి దర్యాప్తు చేయాలని కేంద్ర మంత్రిని కోరామన్నారు. అలాగే నిర్వాసితులకు న్యాయం చేయాలనీ, ఉక్కు ఆస్తులను విక్రయించవద్దని వేడుకున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, కేఎస్ఎన్ రావు, నీరుకొండ రామచంద్రరావు, ఎస్.రామారావు, వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి సన్నిధిలో తిరుప్పావడ సేవలో పాల్గొన్న భక్తులు

ఎస్టీబీఎల్ శ్రీవారికి తిరుప్పావడ సేవ

అక్కిరెడ్డిపాలెం, జూలై 11: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో గురువారం తిరుప్పావడ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేదపండితులు వేంకటేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకించాక కనకాంబరాలు, ప్రత్యేక నగలతో అలంకరించారు. అనంతరం సుమారు 25 కిలోల పులిహోరాను స్వామివారి ముందు ఏర్పాటు చేసిన వేదికపై శ్రీవారి ఆకారంలో అమర్చి నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులకు స్వామివారి నేత్ర, నిజరూప దర్శన భాగ్యం కల్పించారు. పూజాది కార్యక్రమాల్లో పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

సాయినాథునికి ప్రత్యేక పూజలు

అగనంపూడి, జూలై 11: ఇక్కడి షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం షిర్డీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయినాథున్ని నూతన వస్త్రాలు, పుష్పాలతో అర్చకులు అలకరించి పూజలు జరిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి సాయిబాబాకు పూజలు, అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం సేవా సమితి ఆధ్వర్యంలో అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం భజనతో పాటు భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు కొయ్య వెంకటరమణారెడ్డి, వ్యాసశర్మ, శంభుడు, రామారావు, సత్యలక్ష్మి, పంకజ, సూరీడమ్మ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

గర్భాశయ కేన్సర్‌పై అవగాహన ఉండాలి

అక్కిరెడ్డిపాలెం, జూలై 11: గర్భాశయ, రొమ్ము కేన్సర్ల పట్ల మహిళలు అవగాహన కలిగి ఉండడంతో పాటు వాటిని సకాలంలో గుర్తించి తగిన చికిత్స పొందాలని మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.సుబద్ర అన్నారు. గర్భాశయ, రొమ్ము కేన్సర్‌పై షీలానగర్ అప్‌కీప్ వెల్ఫేర్ అసోసియేషన్, మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి సంయుక్తంగా గురువారం షీలానగర్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత ఆధునిక శస్త్ర చికిత్సలద్వారా కేన్సర్‌ను పూర్తి స్థాయిలో నిర్మూలించవచ్చన్నారు. ఈ శిబిరంలో పలువురు మహిళలను పరీక్షించి వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుధానంద్, కాలనీ నాయకులు వై.సత్యవతి, పీఎస్ఎన్ రాజు, సత్యారావు, సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న అధికారుల సంఘం ప్రతినిధులు

కేంద్ర మంత్రికి వినతుల వెల్లువ

ఉక్కుటౌన్‌షిప్, జూలై 11: స్టీల్‌ప్లాంట్ పర్యటనకు విచ్చేసిన కేంద్ర ఉక్కు శాఖా మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి ఉక్కు అధికారుల సంఘం, కార్మిక నాయకులు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు వినతిపత్రాలు అందజేశారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని, సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, ప్లాంట్‌కు ఆర్థిక భరోసా కల్పించాలని, జాతీయ, రాష్ట్ర ప్రాజెక్టులకు స్టీల్‌ప్లాంట్ ఉక్కును వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, తదితర అంశాలపై వినతిపత్రాలను అందించారు. కేంద్ర మంత్రికి వినతిపత్రాలు అందజేసిన వారిలో అధికారుల సంఘం ప్రతినిధులు చంద్రరావు, కేవీడీ ప్రసాద్, కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కేఎస్ఎన్.రావు, విళ్లా రామ్మోహన్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు బయ్యే మల్లయ్య, తౌడన్న, తదితరులు ఉన్నారు. అదేవిధంగా స్టీల్‌ప్లాంటుకు సహకారాన్ని అందించి నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని కోరుతూ కుమారస్వామికి బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు సన్యాసిరావు, తదితరులు వినతిపత్రం అందించారు.

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంటుకు సంబంధించిన మిగులు భూమిలో ఐదెకరాల స్థలాన్ని గీత సహ కులాల వారికి కేటాయించాలని కోరుతూ కేంద్ర ఉక్కు గనులు శాఖా మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి పారిశ్రామిక ప్రాంత గీత సహ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెల్లుబోయిన నాయుడు ఉక్కు గెస్ట్ హౌస్‌లో వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌కు భూసేకరణ చేయడం వల్ల యాత, బలిజ, గౌడ, శ్రీశైన కులాల వారు గీతవృత్తికి దూరమయ్యారని, తమకు స్థలం కేటాయిస్తే తమ వృత్తిని కొనసాగిస్తారని పేర్కొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: బెల్ హెచ్‌పీవీపీ అభివృద్ధికి సహకరించవలసిందిగా కేంద్ర మంత్రులు కుమారస్వామి భూపతిరాజు శ్రీనివాసవర్మలకు సంస్థ బీఎంఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. విశాఖ విచ్చేసిన కేంద్ర మంత్రులను గురువారం వారు కలిసి బెల్ హెచ్‌పీవీపీలో నెలకొన్న సమస్యలను వివరించారు. పూర్తి స్థాయిలో వర్క్ ఆర్డర్లు వచ్చేలా చూసవి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు ఎ.రమేశ్‌కుమార్, భూపేంద్ర బిషి, ఎల్‌డీ సాహు, నాయుడు కోరారు.

రామ, నృసింహావతారంలో జగన్నాథస్వామి



రామ, నృసింహావతారంలో పూజలందుకున్న జగన్నాథుడు

అగనంపూడి, జూలై 11: అగనంపూడిలో నిర్వహిస్తున్న రథోత్సవాల్లో భాగంగా గురువారం జగన్నాథస్వామి రామ, నృసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఇంద్రద్యుమ్న మందిరంలో కొలువుదీరిన బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. పలువురు మహిళలు లలిత సహస్రనామ పారాయణాన్ని పఠించారు. హీరా పంచమిని పురస్కరించుకుని ఆలయంలో శ్రీమహాలక్ష్మీదేవికి పూజలు చేయడంతో పాటు అమ్మవారిని గరుడ వాహనంపై ఊరేగించారు. సాయంత్రం శ్రీసత్యసాయి భజన మండలి ఆధ్వ ర్యంలో భజన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు, గల్లా సాయికుమార్, నాగేశ్వరరావు, నాగమణి, కుమారి, వరదరాణి, ఆలయ మేనేజర్ జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

జనారుధ్యుడు జగన్నాథుడు



ప్రసంగిస్తున్న నితాయి సేవిని మాతాజీ

పెందుర్తి-రూరల్: సకల జీవరాశులు, జనులందరికీ ఆరాధ్యుడు జగన్నాథస్వామి అని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకురాలు, ఇస్కాన్ ఆలయ సహ వ్యవస్థాపకురాలు డాక్టర్ నితాయి సేవిని మాతాజీ అన్నారు. మండలంలోని చింతల అగ్రహారం గవరపాలెం కాలనీలోని గోపాలకృష్ణ ఆలయంలో నిర్వహిస్తున్న రథోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆమె భక్తులను ద్దేశించి ప్రసంగించారు. విష్ణుమూర్తి మరో అవతారమే జగన్నాథస్వామి అని, అందుకే లోకకల్యాణార్థం ప్రతిరోజు హరేరామ హరేకృష్ణ నామాన్ని భక్తిశ్రద్ధలతో అందరూ జపించాలన్నారు. జగన్నాథుడు ప్రసాదప్రియుడని, అందువల్ల ఆయనకు మట్టి పాత్రల్లో తయారుచేసిన ప్రసాదాన్ని నిత్యం నైవేద్యంగా సమర్పించాలన్నారు. ఆ స్వామివారి మహిమలను వివరిస్తూ జగన్నాథుని దివ్య ఆశీసులతోనే తాము నగరంలో ఇస్కాన్ ఆలయాన్ని నిర్మించామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

పెందుర్తి, జూలై 11: పెందుర్తి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి గుర్రమ్మపాలెం 11కేవీ ఫీడర్‌లో మరమ్మతు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా గుర్రమ్మపాలెం, జగనన్న కాలనీ, గోవిందపురం, ముదపాక, బొడ్డునాయుడు పాలెం, రాజయ్యపేట, సరిపల్లి, రాయవరపువానిపాలెం, జంగాలిపాలెం, చిక్కాలిపేట, నీలకంఠాపురం, అప్పన్నపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సుజాతనగర్ సబ్ స్టేషన్ పరిధిలో..

సుజాతనగర్ సబ్ స్టేషన్ పరిధి 11కేవీ వుడా ఫీడర్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ శ్రీనవాసరావు తెలిపారు. ఈ కారణంగా సుజాతనగర్ బీ-జోన్, సప్తగిరినగర్, హష్మినగర్, గ్యాస్ గోడౌన్, గణేశ్‌నగర్, బ్యాంకు కాలనీ, వుడా కాలనీ, రైల్వే విహార్, వీరానగర్, అంబేడ్కర్ నగర్, చిన ముషిడివాడ, ప్రసాద్‌నగర్, శ్రమశక్తినగర్ 3, 4 లాస్ట్ బస్టాప్, బంగారమ్మ కాలనీ, సత్యానగర్ ప్రాంతాలను విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సత్తివానిపాలెం సబ్ స్టేషన్ పరిధిలో..


వేపగుంట: సత్తివానిపాలెం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ వేపగుంట ఏఈ డి.వి.రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా సత్తివానిపాలెం, కోటనరవ, ఎంఈఎస్ కాలనీ, అహ్మద్‌నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించి తమకు సహకరించవలసిందిగా కోరారు.

'కింజరాపు'ను కలిసిన కరక దేవుడు



కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కరక దేవుడు

పెందుర్తి, జూలై 11: కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహననాయుడుని తెలుగుదేశం పార్టీ పెందుర్తి మండల అధ్యక్షుడు కరక దేవుడు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం నగరంలోని సర్క్యూట్ హౌస్‌లో కేంద్ర మంత్రిని ఆయన కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి మండలంలో టీడీపీ బలోపేతానికి చేస్తున్న చర్యలను వివరించారు. పౌర విమానయాన సేవలను సామాన్యులకు అందుబాటులోకి తేవాలని కోరారు.



కలగా మిగిలిన రైతు బజారు ఏర్పాటు

దక్షిణ నియోజకవర్గ పరిధిలో ప్రజల ఇక్కట్లు

బహిరంగ మార్కెట్‌లో కూరగాయల కొనుగోలు

డాబాగార్డెన్స్, జూలై 11: వైజాగ్ అంటేనే...ముందుగా గుర్తొకొచ్చేది.. పాతనగరం.. ఈ ప్రాంతం క్రమేపీ నిరాదరణకు గురవుతోంది. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి దూరమవుతోంది. ఇందుకు నిదర్శనం లక్షలాది మంది నివసిస్తున్న వన్‌టౌన్‌లో ఇంతవరకు రైతుబజారు ఏర్పాటు చేయకపోవడమే. అవసరాలకు పూర్ణామార్కెట్, ఇతర మార్కెట్‌లకు వెళ్లాల్సి వస్తోంది. వ్యాపారుల దోపిడీతో సామాన్య మధ్య తరగతి కుటుంబాలు చిదిగిపోతున్నాయి. రైతుబజారు ధరలకు వ్యాపారుల వద్ద కూరగాయలకు కిలోకు రూ.20 అదనం. ఈ స్థితిలో ఇక్కడ రైతుబజారు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. ఉత్తర నియోజవర్గంలో మూడు, తూర్పులో రెండు, పశ్చిమలో రెండు రైతు బజార్లు ఉన్నాయి. దక్షిణ నియోజకవర్గంలోనే కనీసం ఒక్కటైనా లేకపోవడంపై ఈ ప్రాంతవాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పూర్ణామార్కెట్, రామకృష్ణబజార్‌లే దిక్కు..

ఏ చిన్నవస్తువునైనా పూర్ణామార్కెట్, రామకృష్ణబజార్



నూకాలమ్మ గుడి వద్ద రోడ్డుపైనే పండ్ల విక్రయాలు

బజార్‌లను ఆశ్రయించాల్సి వస్తోందని, అయితే అక్కడ రైతుబజార్ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. జ్ఞానాపురంలో ఉన్న హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వ్యాపారులకు మాత్రమే ఉపయోగపడుతోంది. నగరమంతా కూరగాయలు సరఫరా చేసే నియోజకవర్గంలో రైతుబజారు లేకపోవడం దారుణమని వ్యాఖ్యానిస్తున్నారు.

మూడు లక్షల జనాభాకు పాట్లు

నియోజకవర్గంలోని 14 వార్డుల పరిధిలో సుమారు మూడు లక్షలకుపైగా జనాభా ఉంది. ఇందులో ఎక్కువ


రామకృష్ణజంక్షన్ వద్ద జీవీఎంసీ మార్కెట్

గా నిరుపేద, దిగువ మధ్యతరగతి ప్రజలే. కూలిపనులు, తోపుడుబండు, ఆటోడ్రైవర్లు జీవనం సాగిస్తున్నారు. వీరంతా బహిరంగా మార్కెట్‌లో పెరుగుతున్న కూరగాయలను, టమాటాలను కొనే పరిస్థితి లేదు.

స్థలం చూపిస్తే నిర్మిస్తాం

దక్షిణ నియోజకవర్గంలో ప్రభుత్వం స్థలం అందుబాటులో లేదు. స్థలం ఉంటే రైతుబజార్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. సంబంధిత అధికారులు ఈ ప్రాతంలో స్థలం గుర్తిస్తే రైతుబజార్ నిర్మాణానికి సిద్ధంగా ఉన్నాం. **-యాసిన్, మార్కెటింగ్ శాఖ అధికారి**

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకం


అమ్మవారికి అభిషేకాలు నిర్వహించిన దృశ్యం

జగదాంబ కూడలి, జూలై 11: వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం త్రికాల పంచామృతాభిషేకం నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన కార్యక్రమంలో 12 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. అర్చకులు వారితో పూజలు జరిపించి, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం అమ్మవారికి జలాభిషేకం చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, జూలై 11: ఆశీలమెట్ట సెక్షన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫా ఉండదని ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. గురుద్వారా, రమ ఆస్పత్రి, సీతంపేట, విజయ మెడికల్, సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్, ఏపీఎస్ఈబీ కాలనీ, పరిసర ప్రాంతాల్లో సరఫరాను నిలిపివేస్తామన్నారు.

అక్కయ్యపాలెం పరిధిలో...

అక్కయ్యపాలెం: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. నరసింహనగర్, రైతుబజారు, గణేష్‌నగర్, గణేష్ సేవా సంఘం, వరహగిరి కాలనీ, దాలిరాజు సూపర్ మార్కెట్, జగ్గారావు బ్రిడ్జి, యలమంచిలి వారి వీధి, శివరామరెడ్డి స్వీట్స్ షాప్, అబిద్‌నగర్, అక్కయ్యపాలెం ప్రధాన రహదారి ప్రాంతాల్లో ప్రాంతాల్లో ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండన్నారు.

జగదాంబ పరిధిలో...

జగదాంబ కూడలి: నిర్వహణ పనుల నేపథ్యంలో జోన్ 1 డివిజన్ పరిధి ఆఫీషియల్ కాలనీ, కలెక్టర్ ఆఫీసు డౌన్ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని జోన్ 1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

యోగాతో అనారోగ్య సమస్యలు దూరం


శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న స్వామి రిత్‌దేవ్

కంచరపాలెం, జూలై 11: అన్ని అనారోగ్య సమస్యలకు యోగాతో చెక్ పెట్టవచ్చునని పతంజలి యోగా సమితి ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీఎస్‌వీ.ప్రసాద్ పేర్కొన్నారు. సమితి హరిద్వార్ పర్యవేక్షణలో బాపూజీనగర్, ఎఫ్‌సీఐ గోడౌన్స్ రామకృష్ణ ధ్యాన కేంద్రంలో గురువారం శిక్షణ తరగతులను ప్రారంభించారు. యోగా సాధనతో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 15లోగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎన్.నాగేశ్వరరావు, వైకే.ప్రభాకర్, బి.ప్రభాకర్, మూర్తి, గణపతిరావు, యువభారత్ రెడ్డి, శైలజ, రాంబాబు పాల్గొన్నారు.

ఆత్మరక్షణతో పాటు ఇతరులను కాపాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న మేడపాటి రవీంద్ర

సీతమ్మధార, జూలై 11: పాఠశాలల్లో ప్రమాదాలు జరిగితే ప్రతి విద్యార్థీ ఆత్మరక్షణతో పాటు ఇతర విద్యార్థులను కాపాడాలని బీజేపీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పేర్కొన్నారు. సీతమ్మధార శారద విద్యానిలయంలో రోటరీ ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో గురువారం విద్యారులకు ఫైర్ సేఫ్టీ మాక్ డ్రిల్, అత్యవసర పరిస్థితుల్లో ఆత్మరక్షణ, పర్యావరణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేసీఐ విశాఖ మెట్రో జోన్ ప్రెసిడెంట్ జేడీపీ సురేష్ గొంప, మేడపాటి రవీంద్ర విద్యార్థులతో మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ఆఫ్ విశాఖపట్నం అధ్యక్షుడు బి.వినయ్ గాంధీ, చంద్రశేఖర్, ప్రవీణ, శ్రీనివాసరావు, రంగచార్యులు, ఫైర్ అండ్ సెఫ్టీ మాక్ డ్రిల్, స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ జోనల్ టీటీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక


విజేతలతో ఎల్ఐసీ డీఎం రామారావు, తదితరులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 11: లైఫ్ ఇండియా కార్పొరేషన్ (ఎల్ఐసీ) ఇంటర్ జోనల్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే డివిజనల్ జట్టు ఎంపిక పోటీలు గురువారం ముగిశాయి. విశాఖ రీజనల్ పరిధిలోని విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం బ్రాంచిల క్రీడాకారులు పాల్గొన్నారు. పురుషుల విభాగంలో కె.కార్తీక్, కె.గురుమహేష్, ఎస్ఎస్.గణేష్, మహిళల విభాగంలో వి.జ్యోత్స్న, బి.భవానీ దేవి విజేతలుగా నిలిచారు. ముగింపు కార్యక్రమానికి ఎల్ఐసీ డివిజనల్ మేనేజర్ (పర్సనల్) రామారావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. స్పోర్ట్సు ప్రమోషన్ బోర్డు సభ్యుడు డాక్టర్ డీవీఎస్‌వై.శర్మ మాట్లాడుతూ విజేతలు వచ్చే నెల 7,8వ తేదీల్లో కర్ణాటకలో జరిగే జోనల్ ఎంపికల్లో పాల్గొంటారన్నారు.కార్యక్రమంలో ఎల్ఐసీ క్లబ్ కార్యదర్శి బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరులో ఏఐటీయూసీ జాతీయ సమావేశాలు

జ్ఞానాపురం, జూలై 11: ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు సెప్టెంబరులో మూడు రోజుల పాటు జరుగుతాయని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌కే అచ్యుతరావు తెలిపారు. నగరంలో జరిగే సమావేశాల మొదటి రోజు వేలాది మందితో కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ ఉంటాయన్నారు. ఈ సమావేశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరణ చేయాలన్న నిర్ణయాలు, అసంఘటిత కార్మికుల సమస్యలపై భవిష్యత్తు కార్యచరణను రూపొందిస్తారన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు, నాయకులు బి.వెంకటరావు, ఎస్‌కే రెహమాన్, కె.సత్యాంజనేయ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎస్ఎస్ వలంటీర్లు

జ్ఞానాపురం, జూలై 11: ప్రపంచ జనాభా నిరతరం పెరుగుతూనే ఉందని, ఇది అనేక సమస్యలకు దారి తీస్తోందని డాక్టర్ మాణిక్య కుమారి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం జ్ఞానాపురంలో ఎస్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రపంచం, ప్రకృతిపై జనాభా ప్రభావంపై అవగాహన కల్పించారు. భవిష్యత్తు కోసం మానవ వనరులను కాపాడుకునేందుకు ముందుకు రావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ షైజీ, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్‌బాబు, బి.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

అతిసార నుంచి పిల్లలను రక్షించుకోవాలి

సీతంపేట, జూలై 11: రాబోయే వర్షకాలంలో అతిసార ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాని కూటమి నాయకులు, జీవీఎంసీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సురక్షితమైన నీటిని తాగాలని, ట్యాంకులో, కుండీలో ఎక్కువ రోజులు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 25వ వార్డు టీడీపీ అధ్యక్షులు నమ్మి రవికుమార్, బిజెపి అధ్యక్షులు నరాల బాలకృష్ణ, శానిటరీ ఇన్స్‌పెక్టర్ సన్యాసినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యా ప్రవేశం'పై అవగాహన ర్యాలీ



ర్యాలీలో ఎంఈవో దివాకర్, ఉపాధ్యాయులు

కంచరపాలెం, జూలై 11: విద్యకు ప్రభుత్వం పెద్ద పీట వేసి పేద విద్యార్థులకు వసతులను కల్పిస్తోందని ఎంఈవో డి.దివాకర్ పేర్కొన్నారు.ఎన్‌రోల్‌మెంట్ పెంపు ధ్యేయంగా ప్రభుత్వం అమలుచేస్తున్న విద్యా ప్రవేశం కార్యక్రమాన్ని గురువారం జీవీఎంసీ 48వార్డు రాంజీఎస్టేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీని ఎంఈవో ప్రారంభించి, మాట్లాడారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని కోరారు. అనంతరం రాంజీ ఎస్టేట్, బాపూజీ నగర్, కప్పరాడ తదితర గ్రామాల్లో ప్లకార్డులుతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో రాంజీ ఎస్టేట్ పాఠశాల హెచ్ఎం ఎస్.దొరబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్నాథుడికి పల్లకి సేవ


పల్లకి సేవలో ఈవో రాజగోపాలరెడ్డి, తదితరులు

జగదాంబ కూడలి, జూలై 11: జగన్నాథ రథోత్సవంలో భాగంగా నృసింహావతారంలో ఉన్న స్వామికి గురువారం సాయంత్రం పల్లకి సేవ నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా లక్ష్మీదేవి శీలవిరుపు మహోత్సవం భక్తులను ఆకట్టుకుంది. పండితులు జగన్నాథాచార్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. కాగా శుక్రవారం స్వామికి సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలను సమర్పిస్తారని ఈవో టి.రాజగోపాలరెడ్డి తెలిపారు.

ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు సర్టిఫికెట్లు పంపిణీ

డాబాగార్డెన్స్, జూలై 11: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బి సర్టిఫికెట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్స్‌ను ప్రిన్సిపాల్ ఆర్.మంజుల అభినందించారు. ఈ మేరకు గురువారం విజేతలకు ధ్రువపత్రాలు అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ కె.గీతాంజలి, తదితరులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్లు అందుకున్న వారితో ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు

విశాఖ రుణం తీర్చుకుంటాం

... 5వ పేజీ తరువాయి

కూడా పట్టాలెక్కించాలన్నారు. హైవేపై ఫ్లైవోవర్లు, మెట్రో ఒకదానిపై మరొకటి నిర్మించేలా ప్రణాళికలు రూపొందిస్తే భూసేకరణ భారం తగ్గుతుందన్నారు. లాభం కంటే ప్రజలకు రవాణా సౌకర్యాలు పెంచడమే మెట్రో ప్రాజెక్టు ప్రధాన ధ్యేయమన్నారు. సబ్బవరం నుంచి షీలానగర్, అక్కడ నుంచి పోర్టు వరకు జాతీయ రహదారుల విస్తరణను వేగవంతం చేయాలన్నారు. రైల్వే జోన్‌కు అవసరమైన భూమి విషయంలో వివాదం ఉందని, వారికి ఆమోదయోగ్యమైన స్థలం ఇచ్చి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మెడ్‌టెక్ జోన్‌ను మరింత అభివృద్ధి చేయాలని పేర్కొంటూ ప్రస్తుతం పది వేల కోట్ల వ్యాపారంతో నడుస్తున్న దీనిని రూ.30 వేల కోట్లకు పెంచితే ఎక్కువ మందికి ఉపాధి లభిస్తోందన్నారు. పంచగ్రామాల సమస్యపై దృష్టి పెడతామని, అక్కడ ఇళ్ల మరమ్మతులకు అనుమతి ఇస్తామన్నారు. దేవస్థానం స్థలంలో చాలామంది ఇళ్లు నిర్మించుకున్నారని, వాటిని పరిశీలించి అనుమతులు ఇవ్వాలని, ఇటువంటి చోట్ల మానవీయ కోణంలో ఆలోచన చేయాలని అధికారులకు ఆదేశించారు.

గంజాయిని పూర్తిగా గంజాయి నిర్మూలిస్తామన్నారు. ఈ విషయంలో పోలీసులు ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. విశాఖ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని గతంలో దేశంలో ప్రథమ స్థానంలో ఉన్న నగరం ఇప్పుడు నాలుగైదు స్థానాల్లోకి వెళ్లిందన్నారు. పోర్టు కాలుష్యం, నగరంలో వ్యర్థాల కాలుష్యం పూర్తిగా తగ్గించేలా ప్రణాళికలు అమలు చేయాలన్నారు. ఎన్టీపీసీ ప్లాంట్‌ను గ్రీన్ పవర్ స్టేషన్‌గా మార్చేందుకు యాజమాన్యం ముందుకు వచ్చిందన్నారు. నగరంలో అందరికీ తాగునీరు అందించాలని, ప్రతి ఒక్కరికీ కొళాయి నీటిని అందించాలన్నారు. పోలవరం కాలువ ద్వారా గోదావరి నీరు వస్తే నగరానికి నీటి సమస్య పరిష్కారం అవుతుందని చంద్రబాబు తెలిపారు.

విశాఖలో గత ఐదేళ్లలో పెద్దఎత్తున భూ ఆక్రమణలు జరిగాయని, ప్రైవేటు వ్యక్తుల వద్ద కూడా బలవంతంగా తీసుకున్నారన్నారు. అటువంటి భూములను తిరిగి సొంతదారులకు ఇప్పించాలన్నారు. భూకబ్జాలు చేసిన వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశించారు. అన్యాయానికి గురైన వ్యక్తులకు ఆస్తులు అప్పగింత, కబ్జాదారులు...ఒక్కొక్కటిగా జరగాలన్నారు. ఈ విషయంలో ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలని, జవాబుదారీగా ఉండాలన్నారు. వలంటీర్లు లేకపోతే ఇంటింటికీ పింఛన్లు ఇవ్వలేమన్నారని, కానీ సచివాలయ ఉద్యోగులతో పంపిణీ చేశామన్నారు.

మాడుగుల, చోడవరం మధ్యన సెజ్ ఒకటి తీసుకువస్తామని, అందుకు అవసరమైన భూములు పరిశీలించాలని అనకాపల్లి జిల్లా అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. అభివృద్ధి చేస్తే సంపద పెరుగుతుందని, ఆ సంపదతో సంక్షేమం అందించేలా పాలన ఉండాలని అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత ప్రజల్లో పెద్ద రిలీఫ్ కనిపిస్తోందన్నారు. రైట్‌మెన్‌ను రైట్ ప్లేస్‌లో పెట్టడం ద్వారా పరిపాలిస్తామని పేర్కొన్నారు.

గత ఐదేళ్లలో వైసీపీ పాలకులు అనేక విధాలుగా ప్రజలను, అప్పటి విపక్షాలను వేధించారన్నారు. అధికారంలోకి వచ్చిన తాము ప్రతీకారం తీర్చుకోబోమని, తమ దృష్టి అభివృద్ధిపై ఉందని అధికారులు, ప్రజాప్రతినిధులకు సంకేతాలిచ్చారు. అదే సమయంలో తమది బ్యూరోక్రసీ గవర్నెన్స్ కాకుండా పొలిటికల్ గవర్నెన్స్ అని స్పష్టంచేశారు. సమీక్షలో కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, టీజీ భరత్, గుమ్మడి సంధ్యారాణి, ఎంపీలు ఎం.శ్రీభరత్, సీఎం రమేష్, గాజువాక, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పి.గణబాబు, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్, హరేంధిర్ ప్రసాద్ వేదికపై ఉన్నారు. ఇంకా ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేష్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, కేఎస్ఎన్ఎస్ రాజు, సీపీ శంఖబ్రత బాగ్చి, ప్రభుత్వ కార్యదర్శులు సునీత, అహ్మద్‌బాబు, అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్, టీడీపీ నేతలు గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్, పీలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కులో నూరుశాతం ఉత్పత్తి

... 5వ పేజీ తరువాయి

విలీనం చేయాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలని, ఆర్థికంగా సహకారం అందించాలని మంత్రులను సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా కేంద్ర ఉక్కు మంత్రి హెచ్.డి.కుమారస్వామి మాట్లాడుతూ ప్లాంటు మూసివేతపై భయపడవద్దన్నారు. భారతదేశ జీడీపీని మెరుగుపరచడంలో స్టీల్‌ప్లాంటు ఇతోధికంగా సహాయపడుతుందన్నారు. సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ కేంద్ర మంత్రి కుమారస్వామి విశాఖ స్టీల్‌ప్లాంటుపై ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో ఉక్కు మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్‌రాయ్, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, సెయిల్ స్వతంత్ర డైరెక్టర్ సాగి కాశీవిశ్వనాథరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు ఎకె.బాగ్చి, ఎస్ఆర్‌వీజీకె.గణేష్, జీవీఎన్ ప్రసాద్, సీవీవో ఎస్.కరుణరాజు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉక్కు వర్గాల్లో చిగురిస్తున్న ఆశలు

... 5వ పేజీ తరువాయి

పరిస్థితులు ప్లాంటుకు అనుకూలంగా ఉన్నాయని ఉక్కు వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. బుధవారం స్టీల్‌ప్లాంటులో జరిగిన సమీక్షా సమావేశంలో కూడా ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావులు ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ కానివ్వబోమని అన్నివిధాలా సహకారం అందిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్లాంటుకు త్వరలో మంచిరోజులు వస్తాయని కార్మికులు, ఉద్యోగులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పటికీ, ఇప్పటికీ పరిస్థితులు వేర్వేరుగా ఉన్నాయంటున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ప్లాంటును కూటమి నేతలు నిలబెట్టుకుంటారని ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఏదీ చేయూత?

... 5వ పేజీ తరువాయి

సాకుగా చూపించారు. ఎన్నికల తరువాత బ్యాంకు ఖాతాల్లో జమవుతాయని చెబుతూ వచ్చారు.

ఇప్పుడు రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటైంది. కానీ, లబ్ధిదారులకు సాయం అందలేదు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామంటూ గొప్పలు చెప్పిన జగన్మోహన్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు విడుదల చేసిన సొమ్ము కూడా లబ్ధిదారులకు అందకుండా చేశారంటూ పలువురు వాపోతున్నారు. గొప్పలకు బటన్ నొక్కడమే తప్పితే లబ్ధిదారులకు చేరేలా నిధులను సమీకరించి విడుదల చేయలేదని పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై సచివాలయ సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. ఆ సైట్ ప్రస్తుతం ఓపెన్ కావడం లేదని, తామేమీ చేయలేమని చెబుతున్నారు. ఈ పథకంతోపాటు విద్యాదీవెన పరిస్థితి అలానే ఉంది. ఇప్పటికీ వందలాది మంది విద్యార్థులకు సొమ్ము జమ కాలేదు. జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కడానికి చూపించిన శ్రద్ధ..నిధులు సమకూర్చడంపై పెట్టి ఉంటే లబ్ధిదారులకు ఈ ఇబ్బందులు ఉండేవి కావని పలువురు పేర్కొంటున్నారు.

ఉద్దేశ పూర్వకంగా డీమ్డ్ అప్రూవల్ చేయలేదు

▸▸ జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సురేష్‌కుమార్

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో బిజీగా ఉండడం వల్ల కొన్ని ప్లాన్ దరఖాస్తులను పరిశీలించపోవడంతో డీమ్డ్‌అప్రూవ్ అయ్యాయని చీఫ్ సిటీ ప్లానర్ బి.సురేష్‌కుమార్ పేర్కొన్నారు. 'ఆ 16 ఫైళ్లను వెనక్కిపంపించండి' అంటూ ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందిస్తూ ప్రెస్‌నోట్ విడుదల చేశారు. కమిషన్ లాగిన్‌కు చేరిన కొన్ని ఫైళ్లకు సంబంధించి లోసుగులున్నప్పటికీ వాటిని వెనక్కి పంపించకుండా వదిలేయడంతోనే డీమ్డ్ అప్రూవ్ అయిపోయాయని కార్పొరేటర్ పీతలమూర్తియాదవ్ ఆరోపించిన విషయం తెలిసిందే. దీంతో అప్రమత్తమైన కమిషనర్ సాయికాంత్‌వర్మ 16 ఫైళ్లను పరిశీలించాల్సి ఉన్నందున వెనక్కి పంపించాలంటూ డీటీసీపీకి లేఖ రాశారు. అయితే వాటిని కమిషర్ స్థాయిలోనే పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నందునే వాటిని ఆయనకు పంపించామని సీసీపీ పేర్కొన్నారు ఎన్నికల సమయం కావడంతో కమిషనర్ వాటిని పరిశీలించలేకపోయారని, అందుకే డీమ్డ్ అప్రూవ్ అయిపోయాయని, ఉద్దేశ పూర్వకంగా చేయలేదని విడుదల చేసిన ప్రకటనలో వివరించారు.

ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి

సీతమ్మధార, జూలై 11: ద్విచక్ర వాహనాలు నడిపే వారు ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ ధరించాలని, తమకు తాము సేఫ్టీగా ప్రయాణం సాగించడమే కాకుండా ఎదుటివారికి కూడా ప్రమాదం జరగకుండా నిబంధనలు పాటించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.వెంకటశేషమ్మ పేర్కొన్నారు. సీతమ్మధార రైతు బజార్‌లో రైతులకు, కొనుగోలుదారులకు వాహనదారులు పాటించాల్సిన విధులు, హెల్మెట్ ధరించడం పై గురువారం అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించక పోతే ప్రభుత్వం వారి జరిమానా విధిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎల్ఎపియుఎస్ చైర్మన్ జి.వల్లభనాయుడు, ఎస్టేట్ అధికారి కొండబాబు, సతీష్, రైతులు పాల్గొన్నారు.



వరాహావతారంలో జగన్నాథుడు

భీమునిపట్నం, జూలై 11 : పట్టణంలోని ఇంద్రద్యుమ్న మందిరంలో జరుగుతున్న జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా స్వామివారు వరాహావతారంలో భక్తులకు గురువారం దర్శనం ఇచ్చారు. ఈమేరకు ఆలయ అర్చకుడు రొంపిచర్ల కృష్ణమాచార్యులు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపి, అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం మందిరంలో వరాహావతార విశిష్టతపై పండితులు ప్రవచనాలు చెప్పారు. అలాగే సాయంత్రం తోటకూర అమ్మవారికి పూజలు నిర్వహించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, జూలై 11 : ఆరిలోవ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పైనాపిల్ కాలనీ ఎస్ఎస్ 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ హైమ తెలిపారు. గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పైనాపిల్ కాలనీ, ముడసర్లోవ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్ నగర్, కామాక్షినగర్, సీబీడీ కార్యాలయం, జేఎస్ఎన్ఆర్ కాలనీ, గోల్ఫ్ క్లబ్, ఇండస్ ఆస్పత్రి ఏరియా, దీనదయాళపురం ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆమె కోరారు.

పీఎంపాలెం పరిధిలో...

మధురవాడ/కొమ్మాది : పీఎంపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ స్టేడియం ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 డీఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. వెంకటేశ్వరస్వామి కోవెల ప్రాంతం,ఖుషీ షాపింగ్ మాల్ ప్రాంతం, వుడాకాలనీ మెయిన్ రోడ్, శివాలయం వీధి, వుడా కాలనీ గృహాలు, కారుషెడ్ ప్రాంతం, సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాల ప్రాంతం, పోస్టాఫీసు ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు. అలాగే 11 కేవీ మధురవాడ ఫీడర్ నిర్వహణ పనుల వల్ల ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు రేవళ్ళపాలెం, చంద్రంపాలెం, ఎన్‌జీఓ కాలనీ, వుడాకాలనీ, భగవాన్‌దాస్ కాలనీ, ఎంఎస్ఆర్ లేఅవుట్, సాయిప్రియా లేఅవుట్, భాస్కర్‌నగర్, సంపత్‌నగర్, ఉజ్వల ఆస్పత్రి ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు. కొమ్మాది సబ్‌స్టేషన్ 11 కేవీ సేవానగర్ ఫీడర్ మరమ్మతు పనుల వల్ల కొమ్మాది జంక్షన్, శ్రీనివాసనగర్, సాయిరాం కాలనీ, జీసీసీ లేఅవుట్, టీచర్స్ లేఅవుట్, హౌసింగ్ బోర్డు కాలనీ, అమరావతినగర్, సూర్యాపేపర్, డ్రైవర్స్ కాలనీ, వెంకటనగర్, మాస్టర్ స్కూల్, డీఆర్‌కే రాజు లేఅవుట్, అన్నంరాజునగర్, అష్టలక్ష్మి గుడి ఏరియా ప్రాంతాలకు సరఫరా ఉండదని ఏఈ నరేష్ తెలిపారు.

వెంకోజీపాలెం : జేఆర్‌నగర్ 11 కేవీ ఫీడర్, మద్దిలపాలెం మెయిన్ రోడ్డు 11 కేవీ ఫీడర్ మరమ్మతుల పనుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు జోన్-1 ఈఈ సింహాచలంనాయుడు తెలిపారు. జేఆర్‌నగర్, వెంకోజీపాలెం ప్రాంతం, ఇసుకతోట, లాసన్స్ ప్రాంతం, ఇసుకతోట సిగ్నల్, సీఎంఆర్ ఫంక్షన్ హాల్, నార్త్ స్టార్ ప్రాంతం, మద్దిలపాలెం, భానునగర్ ప్రాంతం, కృష్ణా కళాశాల ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

భవిత కేంద్రాన్ని సందర్శించిన రాష్ట్ర పరిశీలకుడు

భీమునిపట్నం, జూలై 11 : మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న భవిత కేంద్రాన్ని రాష్ట్ర పరిశీలకుడు ఎన్. అమ్మినాయుడు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని పిల్లల సామర్థ్యాలను, ప్రవర్తనను, జీవన నైపుణ్యాలను కేంద్రం ఐఈఆర్ టీచర్లు కేజియాకుమారి, పార్వతిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రం నిర్వహణపై ఎంఈఓలు శివరాణి, జయప్రదకు ఆయన కొన్ని సూచనలు చేశారు. అలాగే పిల్లల తల్లిదండ్రులతో కూడా మాట్లాడారు. పిల్లల మానసిక ఎదుగుదలపై అడిగి తెలుసుకున్నారు.

సినిమా గైడ్

● **భారతీయుడు-2:** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలీస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి),

● **కల్కి:** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **సారంగదరియా :** శ్రీవెంకటేశ్వర, శ్రీ నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 37, టమాటా 45, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 30, పచ్చిమిర్చి 76, కాకరకాయలు 48, బీరకాయలు 34, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజ్ 32, క్యారెట్ 28, దొండకాయలు 34, బంగాళా దుంపలు 31, అరటి కాయ (పె)6, మునక్కాడలు (కిలో) 115, అల్లం (పాతది) 140, బరబటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 52, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 114, పొటల్స్ 36, కీరదోస 32, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 36, చిలగడదుంపలు 36, కంద 56, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	97
ఫారం ధర	--	117
విత్ స్కిన్	--	204
స్కిన్‌లెస్	--	214

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I,IIలో..



భీమిలిలో రైతులతో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు



తోటగరువు రైతుబజారు వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి

ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు

- సామాన్యులకు అందుబాటులో నిత్యావసర వస్తువులు
- ప్రజల ఆకాంక్షల మేరకు పాలన
- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- కొమ్మాది రైతు బజారులో ప్రత్యేక స్టాల్ ప్రారంభం

కొమ్మాది, జూలై 11 : ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాలన సాగుతోందని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన కొమ్మాది రైతుబజారులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలను సామాన్యులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. అందులో భాగంగానే రైతుబజార్లలో ప్రత్యేక స్టాల్స్ ద్వారా కందిపప్పు, మినప పప్పు, బియ్యం అమ్మకాలు చేపడుతున్నామని చెప్పారు.బహిరంగ మార్కెట్ ధరల కంటే తక్కువ ధరలకు ఇక్కడ విక్రయాలు జరుగుతాయని తెలిపారు. చంద్రబాబునాయుడు గతంలో రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి ఇబ్బందులు పడకుండా ప్రజలకు తాజా కూరగాయలు అందించాలన్న సంకల్పంతో దేశంలోనే మొదటిసారిగా రైతుబజార్లను ప్రారంభించారని గుర్తు చేశారు. మధురవాడ రైతుబజార్‌లో అనేక మార్పులు చేయాల్సి ఉందని, రైతుల అవసరాలకు అనుగుణంగా షెడ్లు పెంచాల్సి ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతు బజార్లను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో అనేక సమస్యలు ఉన్నాయన్నారు.రైతుబజారులోకి వచ్చే మార్గం చిన్నగా ఉండడంతో కొనుగోలుదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే కోల్డ్ స్టోరేజ్ విషయమై కూడా అధికారులతో మాట్లాడతానన్నారు. రైతుబజారును మోడల్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. అనంతరం రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, టీడీపీ నాయకులు మొల్లి లక్ష్మణరావు, దాసరి శ్రీనివాస్, నాగోతి సత్యనారాయణ, బోయి శ్రీను, బోయి రమాదేవి, లొడగల జానకీ రామ్, వాండ్రాసి అప్పలరాజు, గొరె గురునాథ్, పిళ్లా వెంకట్రావు, నాగోతి నరసింహనాయుడు, సోడిపల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నిర్వాకం వల్లే ఇబ్బందులు

ఆరిలోవ : తోటగరువు హైస్కూలు వెనుక భాగంలో నిర్మాణంలో ఉన్న రైతు బజారును తూర్పు ఎమ్మెల్యే వెలగ పూడి రామకృష్ణబాబు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబజారు పనులు ఎందుకు నిలిచిపోయాయని, పనులు చేసిన కాంట్రాక్టర్‌కు బిల్లులు ఎందుకు చెల్లించలేదని మార్కెటింగ్ శాఖ జేడీ సుధాకర్‌ను ప్రశ్నించారు.

బిల్లులు పెండింగ్ పెడితే పనులు చేయడానికి ఎవరు ముందుకు వస్తారని నిలదీశారు. తక్షణమే రైతు బజారు నిర్మాణం పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని స్టాల్స్ పూర్తి చేయడంతో పాటు రైతులకు ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. త్వరలోనే రైతుబజారును అందుబాటులోకి తీసుకువస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ఈఈ రవి ప్రకాశ్, ప్రాజెక్టు ఈఈ శాంతి రాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, పదోవార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్, ఎస్సీ సెల్ నాయకులు, 9వ వార్డు ఇన్‌చార్జి బుడుమూరు గోవింద్, ఒమ్మి పోలారావు, 12వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, 11వ వార్డు ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు, 10వ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, కార్యదర్శి సత్యన్నారాయణ, రాజేష్, కేవీ వెంకటేశ్వర్లు, 10వ వార్డు జనసేన నాయకులు, 13వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పాత్రకండి ధర్మారావు, కార్యదర్శి యల్లమల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వెలగపూడి చొరవతో విద్యార్థులకు భోజనం

ఎంవీపీ కాలనీ, జూలై 11 : బీచ్ రోడ్డులోని శాంతి ఆశ్రమం ఉన్నత పాఠశాల విద్యార్థులకు తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చొరవ వల్ల ప్రతిరోజూ మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయనున్నారు. గత ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకం నిలిపేసింది. దీంతో ఇక్కడ చదువుతున్న 350 మంది విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం వినతి మేరకు ఎమ్మెల్యే గురువారం ఆ పాఠశాలను సందర్శించారు. విషయం తెలు సుకుని పాఠశాలలకు మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్న హరే కృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులతో మాట్లాడారు. సేవా దృక్పథంతో వీరికి కూడా భోజనం అందించాలని కోరగా, వారు సానుకూలంగా స్పందించారు. ఈనెల 15 నుంచి భోజనం అందిస్తారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జోన్ 1 కార్యదర్శి బైరెడ్డి పోతనరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ నగర నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం సభ్యులు

మద్దిలపాలెం, జూలై 11 : పిఠాపురం కాలనీలో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీజీ ఈఏ) నగర నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం నిర్వహించారు. అసోసియేషన్‌లోని 16 పదవులకు 16 నామినుషన్లు రావడంతో స్క్రూటినీ చేసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగర అధ్యక్షుడిగా డి. రాజశేఖరరెడ్డి, కార్యదర్శిగా డీవీఎస్ఎన్ రాజు, కోశాధికారిగా సీహెచ్ హరగోపాల్, అసోసియేట్ అధ్యక్షుడిగా జీవన్ సంతోష్, ఉపాధ్యక్షులుగా కె. వెంకటరావు, ఎం. అమర్‌నాథ్, బి. సుచరిత నితాల్, సి. గణేష్ మారుతీరావు, ఐ. గోపికృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.వి.సత్యం, సంయుక్త కార్యదర్శులుగా పి.వెంకటేష్, బి.ప్రసాద్, ఎస్.దిలీప్‌కుమార్, కె.రోహిణి కుమార్, ఎస్.భానురేఖ, బి.సతీష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా అధ్యక్షుడు జవహర్‌లాల్, కార్యదర్శి వి. రాజేశ్వరి వ్యవహరించారు.

సెలవు రోజుల్లో స్కూళ్లు తెరిస్తే చర్యలు

వెంకోజీపాలెం, జూలై 11 : ప్రతి నెలా రెండో శనివారం సెలవును అన్ని పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు తప్పనిసరిగా పాటించేలా చూడాలని విద్యాశాఖాధికారులకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు జారీ చేసినట్టు కమిషన్ సభ్యుడు గొండు సీతారాం తెలిపారు.గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సెలవు అమలులో ఏ యాజమాన్యానికి మినహాయింపు లేదని, పక్కాగా అమలయ్యేలా అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ సెలవు పక్కాగా అమలు చేయాలని కోరుతూ కమిషన్‌కు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బాలల హక్కుల సంఘాల నుంచి వినతులు, సూచనలు, లేఖలు వచ్చాయన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ప్రభుత్వ భూమిలో వేసిన హెచ్చరిక బోర్డు వద్ద రెవెన్యూ అధికారులు

పద్మనాభం, జూలై 11 : మండలంలోని కృష్ణాపురంలో అమ్మకానికి పెట్టిన ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు గురువారం రెండోసారి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రభుత్వ భూమిలో బోర్డును తొలగించిన విషయమై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తకు కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, ఆర్డీఓ భాస్కరరెడ్డి స్పందించారు. వెంటనే బోర్డు ఏర్పాటు చేయాలని తహసీల్దారు వెంకటరావును ఆదేశించారు. ఈమేరకు ఆయన సిబ్బందితో వెళ్లి అన్యాక్రాంతమైన భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. గతంలో దుండగులు తొలగించిన బోర్డును కూడా గుర్తించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ గ్రామంలో సర్వే నెంబరు 82లోని 8.50 ఎకరాల ప్రభుత్వ భూమిని సంరక్షించడానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. దీన్ని ఎవరు ఆక్రమించడానికి ప్రయత్నించినా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు ఆర్ఐ కోటి, మండల సర్వేయరు లీల, వీఆర్వో రవి ఉన్నారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, జూలై 11 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూ, నీలాదేవి సమేతంగా స్వర్ణాభరణలతో శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ సంపెంగలు తీసుకువచ్చి ఏఈఓ ఆనందకుమార్ పర్యవేక్షణలో భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణ జరిపారు. అనంతరం ముఖ్య అర్చకుడు సాతులూరి నరసింహాచార్యులు భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు ఒక్కొక్క స్వర్ణ పుష్పంతో పూజ చేశారు. అనంతరం అదే వేదికపై స్వామివారికి ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

ఒప్పంద అధ్యాపకుల వినతి

వెంకోజీపాలెం, జూలై 11 : ఏయూ క్యాంపస్‌లో వివిధ కళాశాలలకు చెందిన ఒప్పంద అధ్యాపకులు కొత్తగా ప్రిన్సిపాల్ బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజుకు పలు సమస్యలపై గురువారం వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు.

వనరులకు మించి జనాభా పెరుగుదలతో నష్టం

ప్రపంచ జనాభా దినోత్సవంలో వక్తలు

భీమునిపట్నం, జూలై 11 : దేశంలో ఉన్న వనరులకు మించి జనాభా పెరిగితే మానవ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. జ్యోతికుమారి అన్నారు. గురువారం కళాశాలలో జరిగిన ప్రపంచ జనాభా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. ప్రపంచ జనాభా 814 కోట్లు వుండగా, మనదేశంలో 144 కోట్లు ఉన్నారని చెప్పారు.అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్‌కు గుర్తింపు వున్నా, అందుకు తగ్గ వనరులు లేకపోవడం వల్ల దేశ భవిష్యత్‌కు ఇబ్బందికరమని అభిప్రాయపడ్డారు. లెక్చరర్ మహాలక్ష్మి మాట్లాడుతూ అనేక దేశాల్లో జనాభా పెరుగుదల సమస్యగా మారుతుంటే జపాన్ వంటి కొన్ని దేశాలకు జనాభా తరుగుదల సమస్యగా మారడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎల్. సుధాకర్, సీఏ సోమయాజులు, గొట్టేటి రవి, హరిణి, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డులో ఉన్న ప్రాథమిక పాఠశాలలోనూ ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు జనాభా పెరుగుదల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను తెలియజేస్తూ పోస్టర్ తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.



డైట్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా పెరుగుదలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఐ. విజయబాబు మాట్లాడుతూ వైద్య రంగంలో వచ్చిన మార్పుల వల్ల శిశు మరణాల రేటు తగ్గి జనాభా పెరుగుతుందన్నారు. ప్రస్తుతం రెండో స్థానంలో ఉన్న భారత్ ముందుందు చైనాను దాటి మొదటి స్థానంలోకి వెళ్లే అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం జనాభా పెరుగుదలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. జయ, అధ్యాపకులు శ్రావణ్‌కుమార్, రవిబాబు, సీహెచ్ లక్ష్మి, రూపవాణి, ధనలక్ష్మీ, తదితరరులు పాల్గొన్నారు.

యువతతోనే దేశ అభ్యున్నతి సాధ్యం

వెంకోజీపాలెం : యువతతోనే దేశ అభ్యున్నతి సాధ్యమని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని ఏయూ స్టాటస్టిక్స్ విభాగంలో జనాభా పరిశోధన కేంద్రం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వాలు కల్పించాలని కోరారు. అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే భారత్‌లో ప్రజల సగటు జీవన వయస్సు తక్కువగా ఉంటోందన్నారు. పాలకులు ప్రజలకు మంచి ఆరోగ్యాన్ని అందిస్తూ, నాణ్యమైన జీవనం సాగించేలా చూడాలన్నారు. ఏయూ విశ్రాంత ఆచార్యులు, లయన్స్ క్లబ్ వాల్తేర్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆచార్య ఎన్‌వీబీఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన ప్రజలే దేశానికి అతిపెద్ద వనరుగా నిలుస్తారన్నారు.అనంతరం ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను నిర్వాహకులు ప్రదానం చేశారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటరు మంగవేణి, అధికారులు, వైద్య సిబ్బంది

ఎంవీపీ కాలనీ, జూలై 11 : పరిసరాల పరిశుభ్రతతో డెంగ్యూకి చెక్ చెప్పవచ్చని 18 వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి పోలారావు అన్నారు. వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం, జీవీఎంసీ ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో అతిసార నుంచి రక్షణ పేరిట అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తీవ్ర జ్వరం, తలనొప్పి, కీళ్లు, కండరాల నొప్పి, వికారం, చర్మంపై దద్దుర్లు, తీవ్ర అలసట వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడ్ని సంప్రతించాలని చెప్పారు. అలాగే అతిసార రాకుండా పిల్లలను రక్షించుకోవాలని, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం, సురక్షితమైన నీరు తాగడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ, జీవీఎంసీ ఆరోగ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఆరిలోవ : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శానిటరీ అధికారులు సూచించారు. వారు 11వ వార్డులో ఉన్న గాంధీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మాజీ మంత్రి గంటా లేఖ

సిరిపురం, జూలై 11 : నియోజకవర్గంలోని పలు సమస్యలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు దృష్టికి తీసుకువెళ్లారు. ఈమేరకు గురువారం ఆయన సీఎంకు ఓ లేఖ రాశారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం... సింహాచలం దేవస్థానం భూ సమస్య వల్ల అడవివరం, వేపగుంట, వెంకటాపురం, చీమలాపల్లి, పురుషోత్తపురం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పక్కనున్న ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతుండగా ఈ ఐదు గ్రామాల ప్రజలు మాత్రం స్థలాలను ఏమీ చేసుకోలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఐఐఎం పెట్రోలియం యూనివర్సిటీ, భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టు, సువిశాలమైన తీరం అందుబాటులో ఉన్నందున అదే కోవలో ఏవియేషన్ అండ్ టూరిజం యూనివర్సిటీ ఏర్పాటయ్యేలా చూడాలన్నారు. దీనివల్ల పౌర విమానయాన, పర్యాటక రంగాల్లో స్థానికులకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. అలాగే విశాఖ, భీమిలి భోగాపురం మధ్య ఉన్న 46 కిలోమీటర్ల సువిశాల తీర ప్రాంతం అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. భీమిలి నుంచి భోగాపురం వరకు ఆరు వరసల బీచ్ ఫ్రంట్ రోడ్డును కొంగవానిపాలెం, కంచేరు, అన్నవరం, చిప్పాడ, మూలకుద్దు, కమ్మరిపాలెం మీదుగా భీమిలి వరకు నిర్మిస్తామన్నారు.

నగరపాలెంలో రెండు తులాల బంగారం చోరీ

భీమునిపట్నం (రూరల్), జూలై 11 : మండలంలోని నగరపాలెంలో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. దొంగలు ఇంట్లోని రెండు తులాల బంగారం, రూ. 50 వేల నగదు అపహరించారని బాధితుడు మురళీరమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బుధవారం రాత్రి రమణ కుటుం బీకులంతా మేడ మీద పడుకుని ఉండగా గేటు కొడుతున్నట్టు చప్పుడు రావడంతో గమనించి కిందకి వచ్చారు. వారి రాకను గమనించిన దొంగలు బంగారం, నగదు పట్టుకుని పారిపోయారు. గురువారం క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ ఆ ప్రాంతాన్ని పరిశీలించాయి. ఎస్ఐ సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవంతి కళాశాలకు స్వయం ప్రతిపత్తి



కళాశాల ప్రతినిధుల నుంచి పత్రాలను స్వీకరిస్తున్న ముత్తంశెట్టి

తగరపువలస, జూలై 11 : తగరపువలస, నర్సీపట్నం ప్రాంతాల్లో ఉన్న అవంతి ఇంజనీరింగ్ కళాశాలలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ స్వయం ప్రతిపత్తిని అందజేసిందని కళాశాలల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం తగరపువలస కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అందుకు సంబంధించిన యూజీసీ పత్రాలను కళాశాల ప్రతినిధుల నుంచి ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1999లో ఏర్పాటు చేసిన ఈ విద్యా సంస్థ జాతీయ స్థాయిలో నేషనల్ అక్రిడేషన్ కౌన్సిల్ నుంచి ముందుగా గుర్తింపు పొందిందన్నారు. కళాశాలకు స్వయం ప్రతిపత్తి రావడం పట్ల ప్రిన్సిపాళ్లు డా. సి. మోహనరావు, డా. మురళీకృష్ణ, డైరెక్టర్ చంద్రశేఖర్‌ను ముత్తంశెట్టి అభినందించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల వైస్ చైర్మన్ శివ నందీష్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష విత్తన బంతులతో మొక్కల పెంపకం

భీమునిపట్నం (రూరల్), జూలై 11 : పట్టణంలోని సౌమ్యగిరి కొండపై లక్ష విత్తన బంతులతో మొక్కల పెంపకం చేపట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈమేరకు రెండో వార్డులో ఉన్న మామిడిపాలెంలోని విద్యాసాగర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విత్తన బంతులను తయారు చేస్తున్నారు. ఈ సందర్భంగా ముమ్మిడిశెట్టి ఆదిత్య మాట్లాడుతూ మిషన్ గ్రీన్ భీమిలి పేరుతో సౌమ్యగిరి కొండపై లక్ష విత్తన బంతులు వేయాలని నిర్ణయించామన్నారు. నేవల్ అధికారులను హెలికాప్టర్ సమకూర్చాలని కోరామని, వర్షాలు కురిసే సమయంలో విత్తన బంతులను జల్లిస్తామని, చెప్పారు. కొండ మొత్తం పచ్చదనంతో నింపివేయాలన్న లక్ష్యంతో మూడేళ్లుగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు.

గోస్తనీ నదిలో ఆక్రమణల పరిశీలన

తగరపువలస, జూలై 11 : తగరపువలస గోస్తనీ నది వంతెన సమీపంలో ఆక్రమణలు, అక్కడ పారబోస్తున్న డెబ్రిస్‌ను టీడీపీ, జనసేన నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నది చుట్టు పక్కల ఆక్రమణలతో పాటు డెబ్రిస్, ఇతర వ్యర్థాలను పెద్ద ఎత్తున పారబోస్తున్నారని చెప్పారు. దీనివల్ల నది చిన్న కాలువ మాదిరి తయారైందని, అధికారులు తక్షణమే స్పందించి ఆక్రమణలతో పాటు నదిలో ఉన్న వ్యర్థాలను తొలగించాలని కోరారు.

'వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలి'

కొమ్మాది, జూలై 11 : పీఎంపాలెం పీహెచ్‌సీలో రాత్రివేళ కూడా వైద్యసిబ్బంది రోగులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కోరనున్నట్టు ఆరో వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన పార్టీ నాయకులతో కలిసి పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆస్పత్రిలో ఉదయం వేళ అన్ని డిపార్టుమెంట్లు అందుబాటులో ఉంటున్నా.. సాయంత్రం ఎవరూ ఉండడం లేదన్నారు. పది పడకలతో ఆసుపత్రి అందుబాటులో ఉన్నా.. రోగులను ఇన్‌పేషెంట్లుగా చేర్చుకునే అవకాశం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో మధురవాడ పీహెచ్‌సీకి వెళ్లాల్సి వస్తుందన్నారు. రాత్రివేళ కూడా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ఎమ్మెల్యేతో మాట్లాడతామని తెలిపారు. ఆయనతో పాటు నాయకులు లొడగల జానకీరామ్, రెడ్డి సత్యనారాయణ ఉన్నారు.

ఏయూలో వసతి గృహాలు పరిశీలన

వెంకోజీపాలెం, జూలై 11 : ఏయూలోని సమతా, మమతా వసతి గృహాలను లా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీత మాణిక్యం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాల్లో వసతులు ఎలా ఉన్నాయో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ జి. వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, జూలై 11 : వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని సీబీఎం కాంపౌండ్ ప్రాంతానికి చెందిన వెంకట సూర్య లక్ష్మీనరసింహం రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని గురువారం రాత్రి దేవాలయ పర్యవేక్షణాధికారి పిళ్లా శ్రీనివాసరావుకు చెక్ రూపంలో అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయ దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

ఆరిలోవ, జూలై 11 : తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు వచ్చినట్టు హెచ్ఎం దుర్గాభవానీ తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన రత్నం సోనియా, టి. రామ్ చరణ్‌కి సీట్లు వచ్చాయని చెప్పారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

అడివివరం హైస్కూల్ నుంచి ఒకరు

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డులోని అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇమంది శ్రావణి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు హెచ్ఎం పైడిరాజు తెలిపారు. గత మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో ఆమెకు 581 మార్కులు వచ్చాయి. బాలికను ఆమె తల్లిదండ్రులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. అలాగే బీసీ గురుకుల పాఠశాల నుంచి 11 మంది సీట్లు సాధించారని పాఠశాల ప్రధానాచార్యులు దాసరి సత్యారావు తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో 5 మంది, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో 5 మంది, ఒంగోలులోని ట్రిపుల్ ఐటీలో మరొకరికి సీట్లు వచ్చాయన్నారు.

భీమిలి నుంచి 11 మంది..

భీమునిపట్నం : పట్టణంలోని ఏపి రెసిడెన్షియల్ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థినులకు ట్రిపుల్ ఐటీ సీట్లు వచ్చాయని పాఠశాల ప్రిన్సిపాల్ జయప్రకాష్ తెలిపారు. 11 మందిలో నూజివీడుకు నలుగురు, ఒంగోలుకు ఒకరు, శ్రీకాకుళం జిల్లాకు ఆరుగురు ఎంపికయ్యారని చెప్పారు.

దివ్యాంగులకు నిత్యావసర సరకుల పంపిణీ

వెంకోజీపాలెం, జూలై 11 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులను అన్ని విధాలా ఆదుకోవాలని దివ్యాంగుల రైట్స్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ సురేష్ మేనన్ కోరారు. ఏయూ గేటు వద్ద గురువారం ఆయన దివ్యాంగులకు నిత్యావసర సరకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం సభ్యులు డాక్టర్ ఆలీ, తిరిపునతి భారతి, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.